ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శనివారం 19 ఏప్రిల్ 2025

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	38.2	28.0
కావలి	37	28
ఆత్మకూరు	39	28
ఉదయగిరి	39	27
కందుకూరు	36	28

చూడాలని ఉంది కాకాణీ.. ఒక్కసారి వచ్చిపోవా!?

- నీ తిట్లు వినకపోతే నిద్ర కూడా రాదయ్యా!
- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి ఎద్దేవా!
- కాకాణి ఆచూకీ చెబితే కరోనా ప్యాలెస్ బహుమతి

వెంకటాచలం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : 'కేసులకు అదరను.. బెదరను అని చెప్పి తొడలు కొట్టిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎక్కడ దాక్కున్నాడో చెప్పాలి. నిన్ను చూడాలని ఉంది ఒక్కసారి వచ్చిపోవయ్యా కాకాణీ.' అంటూ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. మండలంలోని రామదాసుకండ్రిగ పంచాయతీ నాయుడుపాళెంలో రూ.16 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసుల ఖాకీ దుస్తులు ఊడబెరకతానన్న కాకాణి తప్పు చేశాడు కాబట్టే పిరికిపందలా పారిపోయాడని విమర్శించారు. కాకాణి ఆచూకీ తెలిపిన వారికి పార్టీలతో సంబంధం లేకుండా కరోనా ప్యాలెస్‌ను బహుమతిగా ఇస్తామని ఎద్దేవా చేశారు. 'నీ తిట్లు విని చాలా కాలమైంది. నీ తిట్లు వినకపోతే నాకు నిద్ర రాదయ్యా! నన్ను తిడితే మళ్లీ వినాలని ఉంది.



బయటకు రావయ్యా వచ్చి ఒక్కసారి తిట్టవా!?' అంటూ వ్యంగ్యంగా మాట్లాడారు. జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే వల్లభనేని వంశీ, కాకాణి గోవర్ధన్‌రెడ్డి వంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కల్పన, సర్వేపల్లి ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, కూటమి నేతలు రావూరి రాధాకృష్ణమనాయుడు, చల్లా నాగార్జున్‌రెడ్డి, బొబ్బేపల్లి సురేష్‌నాయుడు, చాట్ల వెంకట సుబ్బయ్య, మల్లి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

146 ఎల్సీ గేట్ ఇండికేషన్ ఫెయిల్

- రైళ్ల పరుగుకు అంతరాయం

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే సెక్షన్ పరిధిలోని శ్రీవేంకటేశ్వర పాలెం రైల్వే స్టేషన్ ఎగువ, దిగువ మార్గాలో శుక్రవారం సాయంత్రం మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లు కొదిసేపు ఆగిపోయాయి. రైల్వే అధికా రుల సమాచారం మేరకు.. రైల్వే ఎల్సీగేట్ 146 వద్ద సాంకేతిక లోపంతో ఇండికేషన్ ఫెయిల్ అయింది. గేట్ వేసిన తరువాత కూడా సిగ్నల్ పడకపోవడంతో నెల్లూరు వైపు వెల్లే జనశతాబ్ది, హోరా ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగాయి. వేంకటేశ్వర పాలెం హోమ్ సిగ్నల్ వద్ద దురంతో సూపర్‌ఫాస్ట్ రైలు ఆగింది. ఈ మూడు రైళ్లు ఒక్కొక్కటి 15 నిమిషాల పాటు ఆగిన అనంతరం సిగ్నల్ పడడంతో యధావిధిగా బయలుదేరి వెళ్లాయి.

నేర నియంత్రణకు స్పెషల్ డ్రైవ్

నెల్లూరు (క్రైం) : జిల్లాలో అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లావ్యాప్తంగా పోలీసులు గురువారం రాత్రి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రాత్రి 9 నుంచి 11 గంటల వరకు అన్ని కూడళ్లు, జాతీయ రహదారుల ప్రవేశం, నిష్క్రమణ ప్రాంతాల్లో వాహనాలను తనిఖీ చేశారు. నగరంలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేరపూరిత కార్యక్రమాలు జరగ కుండా, అక్రమ రవాణా అడ్డుకట్ట వేసేందుకు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 4 వేల వాహనాలు తనిఖీ చేయగా డ్రంక్అండ్ డ్రైవ్ 27 కేసులు, ఎంవీ యాక్ట్ 75 కేసులు నమోదు చేసి రూ.68,420 అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. అలాగే 15 అనధికార వాహనాలు సీజ్ చేయడం జరిగిందన్నారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న పలువురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని, వాహనదారులు నిబంధనలు పాటించాలని సూచించారు. కాగా, చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ అయ్యప్ప తన సిబ్బందితో గాంధీబొమ్మ సెంటర్‌లో తనిఖీలు చేస్తుండగా కత్తితో తిరుగుతన్న నాయబ్‌ను పట్టుకున్నారు. మరొకరు పరారయ్యారు.



కపాడిపాలెంలో శిలువను మోస్తున్న నెల్లూరు బిషప్ డాక్టర్ ఎండీ ప్రకాశం

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : సర్వమానవ శ్రేయస్సు కోసం ఏసుక్రీస్తు రక్తతర్పణం చేసిన రోజుగా శుక్రవారం గుడ్‌ఫ్రైడేను జిల్లాలోని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అన్నీ చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. క్రీస్తు బోధనలు వినిపించారు. నెల్లూరులో బిషప్ ఎండీ ప్రకాశం శిలువ మార్గాన్ని కపాడిపాలెం వీధుల్లో నిర్వహించారు. చర్చుల్లో క్రీస్తు మరణానికి ముందు, తర్వాత జరిగిన అద్భుతాలను వివరించారు. కాగా, మానవాళి కోసం రక్తం ధారబోసిన క్రీస్తును స్మరించుకునే రోజే గుడ్‌ఫ్రైడే అని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏసు బోధనలు ఆదర్శనీయమని తెలిపారు. కపాడిపాలెంలో క్రైస్తవులతో కలిసి జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ శిలువ మోసి ప్రార్థనల్లో పాల్గొన్నారు.

రేపు ఈస్టర్

గుడ్‌ఫ్రైడే నాడు శిలువ వేసిన అనంతరం మూడవ రోజు ఆదివారం క్రీస్తు పునరుత్థానం (తిరిగిలేచి) చెందిన రోజుగా ఈస్టర్ పండుగను క్రైస్తవులు జరుపుకుంటారు. ఈ సంద ర్భంగా చర్చి సేవలకు హాజరవుతారు. ఊరేగింపులు, అన్నదానాలు, జాగరణలు చేస్తారు.

టీచర్ల బదిలీకి రంగం సిద్ధం

- సీనియారిటీ జాబితాలపై కసరత్తు
- ఈ నెల 24 నుంచి 26వరకు మెడికల్ బోర్డులు

జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలకు పాఠశాల విద్యాశాఖ రంగం సిద్ధం చేస్తోంది. పదోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితాలను విద్యాశాఖ రూపొందించి వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. వీటిపై అభ్యంతరాలను కూడా స్వీకరించి మార్పు, చేర్పులు చేపడుతూ తుది జాబితాను పారదర్శకంగా విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. అన్నీ పూర్తి చేసి ఈ నెలాఖరున హెచ్ఎంల బదిలీలు, మే నెలలో ఎస్ఏ, ఎస్‌జీటీల పదోన్నతులు, బదిలీలు చేపట్టే దిశగా విద్యాశాఖ వేగవంతంగా అడుగులు వేస్తోంది. ఇందులోభాగంగానే ఈ నెల 24 నుంచి 26వతేదీ వరకు మెడికల్ బోర్డులను కూడా ఏర్పాటు చేయాలని పాఠశాల విద్య కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)

ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు సంబంధించిన ప్రక్రియను విద్యాశాఖ వేగవంతంగా నిర్వహిస్తోంది. ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలను సిద్ధం చేయడం, టీచర్ల అభ్యంతరాలు స్వీకరించి సరిదిద్దడం వంటి వాటిలో సిబ్బంది బిజీగా ఉన్నారు. జిల్లాలో ఈ విద్యా సంవత్సరం భారీగా బదిలీలు జరగనున్నాయని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. దీర్ఘకాలంగా పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీగ్రేడ్ టీచర్లతో కలిపి జిల్లాలో వెయ్యిమందికిపైగా బదిలీలు జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నాయి. వీటన్నింటికి అనుగుణంగా ప్రభుత్వం కూడా మే నెలలో ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతోంది. దీనికోసంగా టీచర్ల బదిలీల నియంత్రణ చట్టం-25 అమల్లోకి తీసుకువచ్చి ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. పాఠశాల విద్య కమిషనర్ ఆదేశాల మేరకు అర్హులైన దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధి పీడితులు తదితర కారణాలపై మెడికల్ సర్టిఫికెట్లు జారీ చేయించేలా ఈనెల 24 నుంచి 26వతేదీ వరకు ఉమ్మడిజిల్లాలో మెడికల్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

బదిలీల్లో పారదర్శకత

ఉపాధ్యాయ బదిలీల్లో పారదర్శకత ఉండేలా బదిలీల ప్రాధాన్యత కేటగిరీల్లో మార్పులు చేశారు. గతంలో కేవలం 40శాతం వైకల్యం ఉన్నవారికి కూడా ప్రాధాన్యత కేటగిరీలో చేర్చడంతో పెద్దఎత్తున సర్టిఫికెట్లు తెచ్చి బదిలీల్లో లబ్ధిపొందారు. ఈ ఏడాది మాత్రం తీవ్ర వైకల్యం ఉన్న వారినే ప్రాధాన్యత కేటగిరీగా పరిగణించనున్నారు. 40శాతం నుంచి 50శాతం శారీరక వైకల్యం, దృష్టిలోపం, వినికిడి లోపం ఉన్నవారికే బదిలీల్లో ప్రత్యేక పాయింట్లు కేటాయిస్తారు. 56 నుంచి 69శాతం వరకు శారీరక వైకల్యం, వినికిడిలోపం, దృష్టిలోపం ఉన్నవారికి కూడా బదిలీల్లో ప్రత్యేక పాయింట్లు కేటాయిస్తారు. 70 నుంచి 80శాతం వైకల్యం ఉంటేనే ప్రాధాన్యత కేటగిరీ టీచర్ల బదిలీల్లో ప్రత్యేక వెసులుబాటు ఉంది. వీరికి వచ్చిన పాయింట్లతో సంబంధం లేకుండా వీరికి బదిలీల్లో స్థానాలు కోరుకునేందుకు ముందుగా అవకాశం ఇస్తారు. అలాగే 80 శాతం అంతకంటే ఎక్కువ శారీరక వైకల్యం, దృష్టిలోపం ఉన్నవారు, 70శాతం అంతకంటే ఎక్కువ శారీరక, దృష్టిలోపం ఉన్నవారు, క్యాన్సర్, గుండె ఆపరేషన్, అవయవ మార్పిడి, మేజర్ న్యూరోసర్జరీ, బోన్, టీబీ, కిడ్నీ మార్పిడి, డయాలసిస్, స్పైనల్ సర్జరీ చేయించుకున్న వారికి ప్రాధాన్యత ఉంటుంది. అదేవిధంగా స్పౌజ్ లేదా పిల్లలు కాని బుద్ధి మాంద్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న వారు, తలసేమియా, హిమోఫిలియా, మస్క్యూలర్ డిస్ట్రోఫీతో వైద్యం చేయించుకుంటున్న పిల్లలు ఉన్నవారు, గుండెలో రంధ్రాలతో పుట్టిన పిల్లలు, ఆపరేషన్ చేయించుకున్న పిల్లలు ఉన్న టీచర్లకు బదిలీల్లో ప్రాధాన్యత కేటగిరీగా గుర్తిస్తారు.

సర్టిఫికెట్లు సమర్పించాలి

ప్రాధాన్యత కేటగిరిల్లో బదిలీ కోరుకునే టీచర్లు దీనికి సంబంధించిన సర్టిఫికేట్‌లు, గత మూడేళ్లకు సంబంధించి వైద్యం చేయించుకుంటున్న ఆధారాలు సమర్పించాలని డీఈఓ డాక్టర్ ఆర్.బాలాజీరావు తెలిపారు. ఈనెల 24 నుంచి 26వతేదీ వరకు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుని సర్టిఫికేట్‌లు పొందాలన్నారు. దీనికోసంగా విద్యాశాఖ అధికారులు సంబంధిత వైద్యఆరోగ్యశాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటున్నారన్నారు. మూడురోజుల్లో సర్టిఫికేట్‌ల జారీకి ప్రత్యేక మెడికల్ క్యాంప్‌లు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

- ఆర్.బాలాజీరావు, డీఈవో



'హేయ్.. హలో!'

- సినీ నటి సమంత సందడి

'హేయ్.. హలో..' అంటూ ప్రముఖ కథానాయకి సమంత సందడి చేశారు. కొడవలూరు మండలం రాజుపాళెంలోని వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న స్పోర్ట్స్ డే టెక్ ఫెస్ట్ వేడుకల్లో శనివారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'శుభం' సినిమా టీజర్‌ను విడుదల చేశారు. విద్యార్థులు ఆటపాటలు, నృత్య ప్రదర్శనలతో అలరించారు.

- కొడవలూరు(ఆంధ్రజ్యోతి)

వీఆర్‌కు ఇద్దరు సీఐలు

- రెండు హత్యలతో డీజీపీ సీరియస్

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో శాంతి భద్రతలు అదుపు తప్పడంపై రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా కన్నెర్రజేశారు. ఈ నెల 16వ తేదీ రాత్రి నవాబు పేట, వేదాయపాలెం పోలీసు స్టేషన్ల పరిధిలో రెండు హత్యలు జరగడం, ఓ హత్య దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ కావడంతో డీజీపీ ఆరాతీశారు. ఈ నేపథ్యంలోనే నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా, వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డిలను వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్త ర్వులు జారీ చేశారు. దీంతో వారు గురువారం రాత్రి రిలీవ్ అయ్యారు. వారి స్థానాల్లో ఎవరినీ నియమించకపోవడంతో నవాబుపేట స్టేషన్ ఇన్‌చార్జ్‌గా బాలాజీ నగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు, వేదాయపాలెం స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్యను నియమించారు.

వారి నిర్లక్ష్యం.. వీరికి శాపం!

- రెండేళ్ల తర్వాత దివ్యాంగులకు ట్రైసైకిళ్లు
- 200 మందికి ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయం
- గతేడాది ఆగస్టులో రూ.14 లక్షల మంజూరు
- కాంట్రాక్టర్లు రాలేదని చేతులెత్తేసిన అధికారులు
- ఒక్క సైకిలూ అందించకుండానే నిధులు వెనక్కి

వారంతా దివ్యాంగులు.. తోటి మనిషి సాయం లేనిదే బయటకు రాలేని విధి వంచితులు.. పట్టుదలతో తమ పనులను తాము చేసుకోవాలన్న ఆత్మవిశ్వాసం కలిగిన వ్యక్తులు.. అటువంటి వారికి ట్రై సైకిళ్లు, ట్రైస్కూటర్లు చాలా అండగా నిలుస్తుంటాయి. అయితే దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారుల తీరు మారింది. ఏడు నెలలపాటు వీరు ప్రదర్శించిన నిర్లక్ష్యమో లేదా మరేదైనా కారణమో తెలియదు కానీ దివ్యాంగులకు దక్కాల్సిన నిధులు వెనక్కు వెళ్లిపోయాయి. మార్చి 31 నాటికి ప్రభుత్వం ఇచ్చిన నిధులను దివ్యాంగుల సంక్షేమ శాఖ వినియోగించుకోకపోవడంతో ఆ కేటాయింపులు రద్దయ్యాయి. దీంతో దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందించాలన్న ప్రభుత్వ ఉన్నత లక్ష్యం నీరుగారింది.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో సుమారు 40 వేల మంది వరకూ విభిన్న ప్రతిభావంతులు ఉంటారు. వారిలో శారీరక వికలాంగులు 10 వేల వరకూ ఉంటారని అంచనా. ఏటా అర్హులైన వారికి ట్రైసైకిళ్లు, ట్రైస్కూటర్లు, ఫోన్లు, వినికిడి యంత్రాలు.. ఇలా అనేక రకాల వస్తువులను ప్రభుత్వం అందజేస్తూ ఉంటుంది. అయితే వైసీపీ ప్రభుత్వంలో ఈ ప్రక్రియకు బ్రేకులు పడ్డాయి. చివరకు నెల్లూరులో ట్రైసైకిళ్ల తయారీ యూనిట్‌ను కూడా మూసివేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గతేడాది ఆగస్టులో జిల్లాలో అర్హులైన దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందించాలని నిర్ణయించింది. 200 మందికి ట్రైసైకిళ్లు అందించేందుకు గతేడాది ఆగస్టు 22వ తేదీన రూ.14 లక్షలు మంజూరు చేసింది. అయితే ప్రభుత్వం నిధులు విడుదల చేసినా ఒక్క దివ్యాంగుడికి కూడా ట్రైసైకిల్ అందించలేదు. ఈ సైకిళ్ల తయారీకి మొదటిసారి టెండర్ పిలవగా ఒకే ఒక కాంట్రాక్టర్ టెండర్ వేశారు. సింగిల్ టెండర్ ఇవ్వకూడదని అధికారులు మరోసారి టెండర్ పిలిచారు. ఈదఫా ఒక్కరు కూడా టెండర్ వేయలేదు. దీంతో మిన్నకుండిపోయారు. వాస్తవానికి టెండర్లు వేసేందుకు కొందరు ముందుకొచ్చినా దివ్యాంగుల సంక్షేమ శాఖలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు బెదిరించి వెనక్కు పంపారని దివ్యాంగుల సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. మొదటిసారి ఒకరు ముందుకు రాగా రెండోసారి ఆ వ్యక్తి కూడా టెండర్ వేయకపోవడమే ఇందుకు నిదర్శనంగా చూపిస్తున్నారు.



విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయం



నిధులు వెనక్కు

రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఏదైనా పర్కుకు నిధులు తెచ్చు కోవడమే కష్టంగా ఉంది. అటువంటిది దివ్యాంగుల సంక్షేమం కోసం నిధులు ఇచ్చినా ఉపయోగించుకోలేకపోవడం తీవ్ర విమర్శలకు తావి స్తోంది. ఏడు నెలల కాలంలో రెండుసార్లు టెండర్లు పిలిచిన అధికా రులు ఆ తర్వాత చేతులు దులుపుకున్నారు. దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ చాలా ముఖ్యమైన విషయం. ఈ ప్రక్రియలో ఎవరూ టెండర్ వేయకపోతే అత్యవసర పనుల కింద నామినేషన్ ఇచ్చి సైకిళ్లు తయారు చేయించే అధికారం జిల్లా అధికారులకు ఉంటుంది. కానీ ఆదిశగా ఎవరూ ఆలోచించలేదు. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది కాబట్టి నిధులు వాడుకోకపోతే వెనక్కు వెళ్లిపోతాయన్న విషయం కూడా అధికారులకు తెలుసు. అయినా సీరియస్‌గా తీసుకోక పోవడం గమనార్హం. ఇప్పుడు ట్రైసైకిళ్ల పంపిణీకి ఇచ్చిన నిధులు వెనక్కు వెళ్లిపోయాయి. దీనిపై కూడా ఇప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలే దంటే దివ్యాంగుల పట్ల అధికారుల వైఖరి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే రాష్ట్ర ప్రభుత్వ నిధులతో తయారు చేసే ట్రైసైకిళ్లపై సీఎం చంద్రబాబు ఫొటో వేయాల్సి ఉంటుందని, ఇది ఇష్టం లేకనే కొందరు అధికారులు ఉద్దేశపూర్వకంగా ట్రైసైకిళ్ల తయారీలో నిర్లక్ష్యం చేశారని దివ్యాంగుల సంఘాల నాయకులు ఆరోపిస్తుండటం కొసమెరుపు

జేసీ దృష్టికి తీసుకెళ్లాం

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిధులిచ్చింది. మొదటి సారి టెండర్ పిలిస్తే ఒక కాంట్రాక్టరే వచ్చారు. రెండోసారి ఎవరూ రాలేదు. ఈ విషయాన్ని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. ఆ తర్వాత ఎటువంటి ఆదేశాలు రాకపోవడంతో ఏమీ చేయలేకపోయాం. ఇప్పుడు నిధులు వెనక్కు వెళ్లాయి. ఈ విషయాన్ని జేసీ దృష్టికి తీసుకెళ్లాం.

- అయూబ్ ఖాన్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	109
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220

కోడిగుడ్ల ధర (100): 420

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9201
వెండి కిలో ధర	రూ. 98.300
వెండి ఒక గ్రాము	రూ.101.30

పాఠశాలలో వంటగది నిర్మాణానికి సాయం

కొండాపురం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్లపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వంట గది నిర్మాణానికి టీడీపీ మండల కన్వీనర్ ఓంకార్ చేయూత నిచ్చారు. వంటగది లేక పడుతున్న ఇబ్బందులను ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకువెళ్లగా స్పందించి రూ.25 వేలతో నిర్మాణం చేయించి శుక్రవారం పాఠశాలకు అప్పగించారు. అలాగే ఈనెల 20వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పుట్టినరోజును పురస్కరించుకొని ముందస్తుగా విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.

న్యూస్ బాక్స్

21న ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ

కావలి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన వక్ఫ్ బోర్డు చట్ట సవరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 21వ తేదీన ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో కావలిలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జేఏసీ నాయకులు తెలిపారు. కావలి జర్నలిస్ట్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో నాయకులు షేక్ నసీర్ అహ్మద్, ఎంబీఏఫ్ రెహమాన్, షేక్ షారూక్, వామపక్షనాయకుడు లక్ష్మీరెడ్డిలు మాట్లాడారు. భారత రాజ్యాంగం అన్ని మతాలకు వారి ఆస్తులను నిర్వహించుకునే హక్కు కల్పించిందని, కేంద్ర ప్రభుత్వం ఈ హక్కును కాలరాయడానికి ప్రయత్నిస్తోందన్నారు. దేశంలోని ముస్లింలు, ప్రజాస్వామిక వాదులు, అన్ని వర్గాల ప్రజలు ఈ వక్ఫ్‌బోర్డు చట్టసవరణ వ్యతిరేకించాలన్నారు. 21న జరిగే ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు జమీర్, జిలానీ, మహబూబ్ బాషా, ఎస్‌డీ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

శ్మశానంలో చేతిపంపునకు మరమ్మతులు

కొండాపురం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగపెంట పంచాయతీ ఆదిమూర్తిపురం గ్రామ శ్మశానంలోని చేతి పంపు దాదాపు నాలుగేళ్ల నుంచి మరమ్మతులకు గురైంది. శ్మశానంలో అంత్యక్రియల సమయంలో నీటి అవసరాలకు నగదు వెచ్చించి ట్యాంకర్లతో తోలించుకోవల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో స్పందించిన గ్రామ టీడీపీ నాయకుడు జాగర్లమూడి శ్రీనివాసులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకువెళ్లగా అధికారులతో మాట్లాడి శుక్రవారం బోరుకు మరమ్మతులు చేయించారు.

జామాయిల్ చెట్ల నరికివేత

గుడ్లూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోట్లూరు అటవీ ప్రాంతంలో అక్రమంగా జామాయిల్ చెట్లను నరికివేశారు. ఫారెస్టు అధికారులు అందించిన వివరాల ప్రకారం.. గుడ్లూరు కమ్మపాలెంకు చెందిన ఇద్దరు యువకులు పోట్లూరు సమీపంలో 185 జామాయిల్ చెట్లను గురువారం నరికి వాటి నెంబర్లను చెరిపివేశారు. అదేరోజు రాత్రి లోడు చేసుకునేందుకు కువ్వలుగా చేస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తుల ద్వారా సమాచారం రావడంతో డీపీఎం స్వాతి సిబ్బందితో కలసి దాడులు చేశారు. ఈ క్రమంలో ఓ యువకుడు పరారు కాగా మనోజ్ అనే యుకుడిని అదుపులోని తీసుకున్నారు. అక్రమ రవాణాకు కూలీలుగా వచ్చిన మండలంలోని మొగుళ్లూరు గిరిజన కాలనీకి చెందిన ముగ్గురు రోజువారి కూలీలను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుపై సమగ్ర విచారణ జరుపుతున్నామని డీపీఎం శుక్రవారం తెలిపారు.

కోదండరాముడి ఆలయంలో ధ్వజారోహణ

బిట్రగుంట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరులోని కోదండరామ స్వామి ఆలయంలో జరుగనున్న ఉత్సవాల సందర్భంగా శుక్రవారం ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. ఉదయం విఘ్నేశ్వర స్వామి పూజ, అఖండ జ్యోతి ప్రజ్వల చేశారు. గుజరాత్‌లోని ఓ టైల్స్ కంపెనీలో తయారు చేయించిన వీరహనుమాన్ చిత్రాన్ని ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నసంతర్పణ చేశారు.

రక్తదాన శిబిరం

కావలి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పాములూరు ఉమ 5వ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె కుమారులు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ శివప్రసాద్, రాజాలు శ్రీధర్ మల్టీసూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ శ్రీధర్ దంపతులతో పాటు వారి సిబ్బంది తదితరులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్, రెడ్‌క్రాస్ బాధ్యులు డి.రవిప్రకాష్, కలికి శ్రీహరిరెడ్డి, కే.హరినారపరెడ్డి, ఆరికట్ల మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి

కందుకూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గట్టమనేని హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 45 ఏళ్లగా కొందరు బడాబాబుల ప్రయోజనాల కోసం ప్రజాప్రతినిధులు తలొగ్గి ఆక్రమణలను చూస్తూ ఊరుకోవడం వల్లే ట్రాఫిక్ సమస్య ఏర్పడిందని పేర్కొన్నారు. ఓవీ రోడ్డులో మహదేవపురం జంక్షన్ నుంచి అంబేడ్కర్ విగ్రహం సెంటర్ వరకు సమగ్ర సర్వే ద్వారా ఆక్రమణలను పూర్తిగా తొలగించాలని తెలిపారు. ప్రధాన రహదారుల్లో ఫుట్‌పాత్‌లను ఖాళీ చేయించి ప్రజలు నడిచేందుకు వీలుగా వాటిని తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. పోస్టాఫీసు సెంటర్‌లో ఉన్న పాత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం స్థలాన్ని పెయిడ్ పార్కింగ్ ప్లేస్‌గా మారిస్తే ట్రాఫిక్ సమస్య తీరటంతో పాటు ప్రభుత్వానికి రాబడి కూడా వస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే పట్టణ అభివృద్ధి పట్ల చిత్తశుద్ధితో ముందడుగు వేస్తే బీజేపీ సంపూర్ణ సహకారం అందిస్తుందని పేర్కొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

● షటిల్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి

కావలి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): క్రీడలు శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా శుక్రవారం కావలి జేబీ కళాశాల ఇండోర్‌స్టేడియంలో నిర్వహించిన షటిల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకుని సరదాగా కొంత సేపు షటిల్ ఆడారు.



షటిల్ ఆడుతున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి అభివృద్ధే లక్ష్యం

కావలి అభివృద్ధే తన ధ్యేయమని ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని 39వ వార్డులో గడపగడపకు ఎమ్మెల్యే కార్యక్రమంలో సమస్యలను తెలుసుకుంటూ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కొన్ని సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ మిగిలినవి త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ పీ.శ్రావణ్ కుమార్, వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబూరావు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, ప్రళయకావేరి మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు

కావలిటౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం పట్టణంలోని చర్చిల్లో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. బ్రిడ్జి సెంటర్‌లోని పాత బాప్టిస్ట్ చర్చి, ఆర్టీసీ ఎదురుగా జీడీ కాంపౌండ్‌లోని చర్చి, కచ్చేరిమిట్టలోని ది తెలుగు బాప్టిస్ట్ చర్చి, బుడమగుంట షారోన్ ప్రార్థన మందిరంలో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు జరిగాయి. చర్చిలను విద్యుదీపాలంకరణ అలంకరించారు.



కావలి : చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

లింగసముద్రం : మండలంలోని శింగరపాలెం, లింగసముద్రం, ఆర్‌ఆర్ పాలెం, పెంట్రాల, మొగిలిచెర్ల, పెదపవని, చినపవని, వీఆర్ కోట, గంగపాలెం తదితర గ్రామాల్లో చర్చిల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శింగరపాలెం చర్చిలో పాస్టర్ ఆల్బర్ట్ చంద్రన్‌పాల్ ప్రత్యేక బోధన చేశారు.

అల్లూరు : మండలంలోని అల్లూరు దళితవాడలోని రక్షణ సైన్యం, బాప్టిస్టు చర్చి, శెటిల్మెంటు ప్రాంతంలోని ట్రినిటి గ్రేస్ మినిస్ట్రీస్ చర్చిలతోపాటు మండలంలోని అన్ని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

బిట్రగుంట : బోగోలులోని హోలీఫ్యామిలీ చర్చి ఫాదర్ బి.పాల్ క్రీస్తు సిలువ మార్గం కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వాటర్ ట్యాంకు పరిశీలన

కావలి రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌదరిపాలెం, బుడంగుంటలలో శిథిలావస్థలో ఉన్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులపై క్షణ క్షణం.. భయం భయం అంటూ ఈ నెల 16న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం చౌదరిపాలెంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న వాటర్ ట్యాంకును మున్సిపల్ ఏఈ షేక్ ఫాజిల్ పరిశీలించారు. ట్యాంకు స్థితిగతుల గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ట్యాంకు పిల్లర్లు పూర్తిగా దెబ్బతిని ఉండటం తో ట్యాంకు కూలితే ప్రక్కనే ఉన్న నివాసాలపై పడుతుందని, ట్యాంకును తొలగించాలని స్థానిక టీడీపీ నాయకుడు గోరంట్ల రాంబాబు ఏఈకి తెలిపారు. పినాకిని కన్సల్‌టెన్సీ వారు వచ్చి ట్యాంకు పరిశీలించి ఇచ్చే డెమాలిష్ రిపోర్టు ఆధారంగా 10 రోజుల్లో ట్యాంకును కూల్చివేత పనులు చేపడుతామని ఏఈ తెలిపారు.



వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ ఏఈ షేక్ ఫాజిల్

రివర్షన్ పొందిన వారికి న్యాయం చేయాలి

కందుకూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): గతంలో హైస్కూల్ హెచ్‌ఎంలుగా, స్కూల్ అసిస్టెంట్లుగా, పీఎస్ హెచ్‌ఎంలుగా పదోన్నతి పొంది రివర్షన్‌లో ఎస్జీటీలుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీల్లో న్యాయం చేయాలని పలువురు ఉపాధ్యాయులు కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఎస్జీటీలుగా రివర్షన్ పొందిన ఉపాధ్యాయుల సమావేశం వారు మాట్లాడుతూ ప్రస్తుతం విడుదల చేసిన ఎస్జీటీ సీనియారిటీ జాబితాలో గత సీనియారిటీని వదిలేసి తాము రివర్షన్ పొందిన తేదీ నుంచి పరిగణిస్తూ అందరికన్నా జూనియర్లుగా చూయించారన్నారు. తాము ఉద్యోగాల్లో చేరిన తేది ఆధారంగా సీనియారిటీ జాబితా రూపొందించాలని కోరారు. సమావేశంలో ముప్పూరి మాల్యాద్రి, జల్లి తిరుమలరావు, రాచపూడి శంకర్, షేక్ అబ్దుల్లా, ఎం.కొండయ్య, కల్లగుంట మోహనరావు, పోకూరి మాలకొండయ్య పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణం

ఉలవపాడు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కరేడు పంచాయతీ పరధిలోని వాక గ్రామంలోని రామాలయంలో శుక్రవారం సీతారాముల కల్యాణం వైభవగా జరిగింది. కందుకూరు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారి ఆశీర్వచనాలతోపాటు తీర్థప్రసాదాలు ఎమ్మెల్యేకు అందచేశారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ

ఉలవపాడు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఉలవపాడులోని కోటిరెడ్డి కుంట ఎస్టీ కాలనీలో శుక్రవారం పాఠశాల విద్యార్థులకు హైకోర్టు న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు తనకుమార్తె శ్రీతేజస్విని పుట్టిన రోజు సందర్భంగా బ్యాగ్‌లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయని వరలక్ష్మి, న్యాయవాది వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులు ఉన్నారు.

కేన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం

కావలిటౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : కావలి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ధనలక్ష్మి కేన్సర్ వ్యాధితో బాధపడుతుండడంతో ఆమె చికిత్సకు బెస్ట్ వాకర్స్ శుక్రవారం రూ.10వేల ఆర్థిక సాయమందించారు. వైకుంఠపురం వాసీ అల్లూరు నాగమణి కోడలు మంజుల మృతి చెందడంతో ఆమె ముగ్గురు పిల్లలు నాయనమ్మ సంరక్షణలో ఉండడంతో వారి పోషణకు రెండు నెలలకు సరిపడా నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో టీవీ శేషయ్య, రమేష్, వెంకటేశ్వర్లు, కృష్ణ, భాస్కర్‌నాయుడు, గౌస్‌బాషా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాసవీనగర్‌లో మరో చోరీకి విఫలయత్నం

కందుకూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవీనగర్‌లో దొంగలు భారీ చోరీకి పాల్పడి వారం రోజులు గడవకముందే మరో ఇంట్లో గురువారం అర్ధరాత్రి చోరీకి విఫలయత్నం జరిగింది. ఇన్నమూరి నరసింహారావు కుటుంబ సభ్యులు బంధువుల ఇంటికి వెళ్తూ తాళం వేసి వెళ్లగా దొంగలు తలుపు తాళం పగులగొట్టి ఇంట్లోని బీరువాను కూడా పగులగొట్టారు. అయితే విలువైన వెండి, బంగారు ఆభరణాలు బీరువాలోని ఇనుప పెట్టెలో ఉండటంతో దొంగలు ఆ ఇనుపపెట్టెను ఓపెన్ చేయలేక వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం తిరిగొచ్చిన నరసింహారావు కుటుంబ సభ్యులు ఇంట్లో ఉన్న 2 కిలోల వెండి దొంగలు అపహరించుకుపోయారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రూరల్ ఎస్ఐ రమణయ్య దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించి బీరువాలోని ఇనుపపెట్టె ఓపెన్ చేయలేదన్న విషయాన్ని గుర్తించి దాని తాళం తీయించగా విలువైన ఆభరణాలన్నీ ఉన్నాయి. అయితే బీరువా పగులగొట్టి ఉండటంతో ఆ కంగారులో ఇనుపపెట్టె చూసుకోలేదని బాధితుడు పోలీసులకు తెలిపాడు. వారం రోజుల వ్యవధిలోనే వాసవీకాలనీలో రెండు చోరీలు జరగటంతో దొంగలు కూడా కాలనీలోనే ఉన్నారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న ఎస్ఐ రమణయ్య, పోలీసు సిబ్బంది

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి : సీఐ

వారం రోజుల వ్యవధిలోనే వాసవీకాలనీలో రెండు దొంగతనాలు జరగడంతో శుక్రవారం రాత్రి సీఐ వెంకటేశ్వరరావు కాలనీలో సమావేశం ఏర్పాటు చేసి దొంగతనాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కాలనీలో సీసీ కెమెరాలు లేనందునే దొంగలను పట్టుకోవటం కష్టంగా మారిందని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే అవకాశం ఉన్న ప్రతిఒక్కరూ తమ ఇంటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించుకోవాలని, తలుపులు తాళాలు వేసి బయటకు వెళ్లేవారు చుట్టుపక్కలవారికి చెప్పటంతో పాటు ఆ ఇంటిపై వాచ్‌మెన్ నిఘావేసి ఉండేలా సమాచారం ఇచ్చి వెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా సైబర్ నేరగాళ్ల వలలో పడి నష్టపోకుండా పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ మహేంద్రనాయక్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూనియర్ ఎడ్ల పరుగు పందెం

అల్లూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : అల్లూరుపేట సత్రంలోని గంగమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల తిరునాళ్ల సందర్భంగా శుక్రవారం రాష్ట్రస్థాయి జూనియర్ ఎడ్ల పరుగు పందెం నిర్వహించారు. పీజీఎం యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో 27 జతల ఎడ్లు పాల్గొన్నాయి. మొదటి, స్థానంలో కోవూరు, రెండో స్థానంలో నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాలెం, మూడోవ స్థానంలో కోవూరు, నాలుగో స్థానంలో కోవూరు మండలం పాటూరు, ఐదో స్థానంలో యల్లాయపాలెంకు చెందిన ఎడ్లు విజేతలుగా నిలిశాయి. వీటి యజమానులకు చిలంకూరు చంద్రశేఖర్‌రెడ్డి రూ.25,116, కడివేటి హజరత్‌రెడ్డి రూ.20,116, వేగూరు అన్వేష్ రూ.15,116, అళహరి రామారావు, మంజుల దంపతులు రూ.10,116, గుండాల గోపాలయ్య, మహాలక్ష్మమ్మ దంపతులు రూ.7,116లు నగదు బహుమతులు అందజేశారు.



మొదటి బహుమతి అందుకుంటున్న విజేత ఎడ్ల యజమాని

బోరుకు కొత్త మోటారు ఏర్పాటు

లింగసముద్రం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంగళాపురం ఎస్సీ కాలనీ (కొమ్ముపాలెం)లో 4 నెలలుగా మరమ్మతులకు గురైన మంచినీటి బోరుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో మంచినీటి బోరుకు రాజకీయ గ్రహణం శీర్షికతో వచ్చిన వార్తకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్‌లు గ్రామానికి చేరుకుని బోరును పరిశీలించారు. మోటారు పాడైపోవడంతో గ్రామ టీడీపీ నాయకుడు లోమడ ప్రసాద్ సహకారంతో కొత్త మోటారు తెప్పించి బిగించారు. అనంతరం ఆయన స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. దీంతో కాలనీవాసులు అధికారులకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు చిట్టిబోయిన రత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.



బోరు నుంచి వస్తున్న నీరు

రేపు చంద్రబాబు జన్మదినాన్ని ఘనంగా నిర్వహించాలి

● టీడీపీ శ్రేణులకు మంత్రి ఆనం పిలుపు

ఆత్మకూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడి 75వ జన్మదిన వేడుకలను ఈనెల 20వ తేదీన ఆత్మకూరు నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించేందుకు టీడీపీ నేతలు, శ్రేణులు సన్నద్ధం కావాలని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి టీడీపీ నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండల కేంద్రంలో చంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. మండల కేంద్రాల్లో, మున్సిపాల్టీలో జన్మదిన వేడుకలను, సేవా కార్యక్రమాలను పూర్తిచేసుకుని అధిక సంఖ్యలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఆత్మకూరుకు తరలిరావాలని, మార్కెట్ కమిటీ ఎదురుగా ఉన్న ప్రాంగణంలో నిర్వహించే పూర్ణాహుతి హోమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. హోమం అనంతరం అన్నప్రసాదం ఏర్పాట్లు చేశామన్నారు. అనంతరం ఆయన హోమం నిర్వహించే ప్రాంగణాన్ని పరిశీలించి ఏర్పాట్లపై తగు సూచనలు ఇచ్చారు. మండలాల వారీగా జన్మదిన వేడుకల నిర్వహణపై టీడీపీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీసీసీ మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, సోమశిల ప్రాజెక్టు చైర్మన్ కేశవచౌదరి, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, టీడీపీ నేతలు తాళ్లూరి గిరినాయుడు, కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, తుమ్మల చంద్రారెడ్డి, దావా పెంచలరావు, పులిమి శైలజారెడ్డి, ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట, సంగం, చేజర్ల, మర్రిపాడు మండలాల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ముఖ్య నేతలు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి : ముస్లిం జేఏసీ

ఉదయగిరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దుచేయాలని కోరుతూ శుక్రవారం ఉదయగిరి పట్టణంలో ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో హిందూ, ముస్లిం, క్రైస్తవులు, పార్టీలకు అతీతంగా నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నుంచి మెయిన్‌బజార్ గుండా పంచాయతీ బస్టాండ్, గండిపాళెం మార్గం మీదుగా ర్యాలీ చేపట్టారు. అనంతరం పెద్ద మసీదు ఆవరణలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి ముస్లిం సమాజానికి నష్టం కలిగించే వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే రద్దుచేయాలని, లేదంటే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా కావలి డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలు, స్పెషల్ పార్టీ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈకార్యక్రమంలో జేఏసీ నాయకులు సయ్యద్ సమీ, అబ్దుసుభాన్, దస్తగిరి అహ్మద్, అహ్మద్‌బాషా, రియాజ్, యస్థాన్, తాజుద్దీన్, వైద్యులు సుధాకర్‌రెడ్డి, వేణుగోపాల్, న్యాయవాది శేషారెడ్డి, సీపీఎం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య, మన్సూర్, రఫిక్‌ఖాన్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరిలో నిరసన ర్యాలీ చేస్తున్న ముస్లిం జేఏసీ నేతలు

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సంగం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని ముంబయి జాతీయ రహదారిపై రాంపు వద్ద గురువారం అర్ధరాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఆటోలో వెంగారెడ్డిపాళెంలో పాల క్యాన్లను తీసుకుని వంగల్లు వెళ్లేందుకు ముంబయి జాతీయ రహదారి మీదుగా వెళ్తూ రాంపు వద్ద రోడ్డు దాటుతుండగా ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఆటోను ఢీకొంది. ఈ సంఘటనలో ఆటో డ్రైవర్‌తోపాటు అందులో ఉన్న మరో వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి గాయాలైనవారిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనంతసాగరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సోమశిల సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ మురళికృష్ణ తెలిపారు. త్రీఫేస్ ఉదయం 8గంటల వరకు ఉంటుందని ప్రజలు గమనించాలని కోరారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ



సభ్యత్వ కార్డులు అందచేస్తున్న టీడీపీ నేతలు

వింజమూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిస్తీపురం పంచాయతీ చింతలపాలెం గ్రామంలో శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ నాయకత్వంలో ఆ గ్రామంలోని బూత్ నెంబరు 173, 174 పరిధిలో పార్టీ సభ్యత్వ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు డాక్టర్ కృష్ణారెడ్డి, లక్కు వెంకటేశ్వర్లు, కంచర్ల శ్రీను, దిద్దిగుంట శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

ఆత్మకూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాల్టీ పరిధిలోని వాటర్ ప్లాంట్‌లు శుభ్రం చేయడం, మోటార్ల మరమ్మతు పనుల దృష్ట్యా శనివారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈక్రమంలో మున్సిపాల్టీ పరిధిలోని 4,5,6,7,8,9,10,11,13,15,16,17,18 వార్డుల పరిధిలో తాగునీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఆదివారం యధావిధిగా నీటి సరఫరా జరుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

ఆత్మకూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. ఆత్మకూరు పట్టణంలోని చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. అలాగే మండలంలో గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



సీతారామపురంలో శిలువ మోస్తున్న చర్చి ఫాదర్ సునీల్


● సంగం: మండలంలో క్రైస్తవులు గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వాడవాడలా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

● సీతారామపురం: స్థానిక ఆర్సీఎం, సీఎస్ఐ చర్చిల్లో గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హరిజనవాడలోని ఆర్సీఎం చర్చి ఫాదర్ సునీల్ ఆధ్వర్యంలో స్థానిక మూడురోడ్ల కూడలి నుంచి చర్చి వరకు ఏసుక్రీస్తు శిలువ మోస్తూ కార్యక్రమం సాగించారు.

● ఉదయగిరి: పట్టణంతోపాటు మండలంలోని గండిపాళెం, వెంగళరావునగర్, అప్పసముద్రం, కృష్ణంపల్లి, కొండాయపాళెం, దాసరిపల్లి, చెరువుపల్లి, బండగానిపల్లి, అయ్యవారిపల్లి తదితర గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రైసవులు చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలు చర్చిల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

ఆత్మకూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని పెట్రోల్ బంకులు, గ్యాస్ గోడౌన్, బాణాసంచా తయారీ కేంద్రాల వద్ద అగ్నిప్రమాదాల నివారణపై అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. గ్యాస్ లీకేజి సంభవించి మంటలు చెలరేగినప్పుడు చేపట్టాల్సిన చర్యలను మాక్‌డ్రిల్ చేసి వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక ఇన్‌చార్జ్ ఫైర్ ఆఫీసర్ కె శ్రీనివాసరావు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



ఆత్మకూరు : మంటలు ఆర్పే విధానాన్ని మాక్‌డ్రిల్ చేసి చూపిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

● ఉదయగిరి : అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి ఫైర్ అధికారి అశోక్‌కుమార్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు పెట్రోల్ బంకుల వద్ద అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రత్యక్షంగా చేసి చూపించడంతోపాటు కరపత్రాలను పంపిణీ చేసి అవగాహన కల్పించారు. పెట్రోల్ బంకుల వద్ద ప్రమాదాలు సంభవిస్తే చేపట్టాల్సిన చర్యలను సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, పెట్రోల్ బంకు సిబ్బంది పాల్గొన్నారు.

పీకేపాడులో చలివేంద్రం ఏర్పాటు

అనంతసాగరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటి కంబపాడులో శుక్రవారం వల్లూరు శ్రీనివాసులు సహకారంతో స్థానిక నాయకులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రం ఏర్పాటుపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

ఉదయగిరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయం సమీపంలో నూతనంగా నిర్మించిన గంగమ్మతల్లి ఆలయంలో శుక్రవారం పంచమి తిథి, మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు తీర్చుకున్నారు.

మురికి కాలువలపై మూతల ఏర్పాటు

వింజమూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న మురికి కాలువపై మూతలు లేకపోవడంతో స్థానికులు బల్లలను అమర్చారు. మురికి కాలువలపై మూతలు లేకపోవడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పట్టణంలోని వైశ్యబజార్, కమ్మబజార్, యాదవ బజార్‌లో కాలువలపై మూతలు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

బత్తాయి.. ధర లేదోయ్!



ఉదయగిరిలో రవాణాకు సిద్ధంగా ఉన్న బత్తాయి కాయలు

- టన్ను రూ.15 వేల నుంచి 20 వేలు
- దిగుబడులూ అంతంత మాత్రమే
- తెగుళ్లతో దెబ్బతింటున్న చెట్లు
- ఆందోళనలో సాగుదారులు

ఉదయగిరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బత్తాయి రైతుల పరిస్థితి నానాటికీ తీసికట్టుగా తయారవుతోంది. ఏ ఏటికి ఆ యేడు పరిస్థితుల్లో మార్పు రాకపోగా, మరింత దిగుజారు తోంది. పెట్టుబడులు కూడా రాకపోతుండటంతో సాగుదారులు తీవ్రంగా నష్టపోతు న్నారు. ఇకపోతే విజృంభిస్తున్న తెగుళ్లు కూడా రైతుల వెన్ను విరిస్తున్నాయి. ఇటీవల ప్రకృతి అనుకూలంగా ఉండడంతో బత్తాయి సాగు పెరిగింది. తెగుళ్లతో కళ్లెదుటే చెట్లు ఎండుతుండటంతో రైతులు కలత చెందుతున్నారు. వాటిని కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. అయినా ప్రస్తుతం ధరలు, దిగుబడులు తగ్గడంతో పెట్టుబ డులు కూడా వచ్చే పరిస్థితి లేదని వారు ఆందోళన చెందుతున్నారు.

● తగ్గిన ధర, దిగుబడులు

సాధారణంగా వేసవిలో బత్తాయి ధరలు పెరుగుతుంటాయి. కాగా వేసవిలో వచ్చే దిగుబడి సాధారణం కంటే 50 శాతం తక్కువగా ఉంటుంది. అయినా ఈసారి ధరలు ఒక్కసారిగా పతనమయ్యాయి. ప్రస్తుతం టన్ను కాయలు రూ.15వేల నుంచి 20 వేలు పలుకుతున్నాయి. ఇంత దారుణమైన ధర ఇటీవల చూడలేదని రైతులు వాపోతున్నారు. దిగుబడి కూడా ఎకరాకు 5 నుంచి 6 టన్నుల మాత్రమే వచ్చింది. ఉదయగిరి నియోజకవర్గం జిల్లాలో బత్తాయి సాగుకు ప్రత్యేకం. ఇక్కడ 2,800 ఎకరాల్లో బత్తాయి సాగులో ఉండగా, అనంతసాగరం, మర్రిపాడు, ఆత్మకూరు, ఏఎస్‌పేట, పొదలకూరు తదితర మండలాల్లో కూడా అధికంగా సాగులో ఉంది. బత్తాయి మొక్క నాటాక ఐదేళ్ల తరువాత దిగుబడులు ప్రారంభమవుతాయి. ఏడాదిలో రెండు లేదా మూడు పర్యాయాలు దిగుబడులు వస్తాయి. జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో వచ్చే కాపు, ఫిబ్రవరి ఆఖరుకి, మార్చి, ఏప్రిల్ మాసాల్లో కోతకు వస్తాయి. అంటే వేసవిలో ఈ పంట కోతకు వస్తుంది. ఆ సమయంలో దిగుబడి తక్కువగా ఉండడం, వేసవి కావడంతో ధరలు ఆశాజనకంగా ఉంటాయి. ఎంత తక్కువ అనుకున్నా టన్ను రూ.50 నుంచి రూ.60 వేలు వరకు ఉంటుంది. గతంలో టన్ను రూ.లక్ష పలికిన రోజులూ ఉన్నాయి. అలాంటిది ఈ ఏడాది ధరలు రోజురోజుకు పడిపోతూనే ఉన్నాయి. ప్రస్తుతం టన్ను ధర రూ.15 నుంచి రూ.20 వేలు పలుకుతుంది. ఎకరాకు 8 నుంచి 10 టన్నుల దిగుబడి రావాల్సి ఉండగా 5 నుంచి 6 టన్నుల దిగుబడి మాత్రమే వస్తున్నది.

● వాతావరణంలో మార్పు

వాతావరణంలో మార్పులు ఏర్పడుతుండడంతో చెట్లకు తెగుళ్లు ఎక్కువయ్యాయి. వేరుకుళ్లు, బంక తెగుళ్లు చెట్లను పట్టిపీడి స్తున్నాయి. రైతులు ఎన్నిమం దులు పిచికారి చేసినా ఫలితం లేకుండా పోయింది. దీనికితోడు ఈ ఏడాది పొగమంచు కూడా ఎక్కువసార్లు కురవడంతో బత్తాయి దిగుబడులపై ప్రభావం చూపడంతోపాటు మంగు, కంకర తెగులు విజృంభించాయి. దీంతో దిగుబడులు బాగా తగ్గాయని రైతులు అంటున్నారు.

ధరలు లేక నష్టాలు



ఐదెకరాల్లో బత్తాయి సాగు చేస్తున్నా. ఏడాదికి రెండు పర్యాయాలు చెట్లకు మం దులు, దున్నకం, కూలీలు, ఇతరత్రా ఖర్చులు కలిపి రూ.3 లక్షల వరకు వెచ్చించాల్సి వచ్చింది. ఈ ఏడాది దిగుబడి కూడా అంతంతమాత్రంగా ఉంది. ప్రస్తుతమున్న ధరలతో పెట్టుబడులు కూడా రావు.

- గడ్డం వెంకటేశ్వర్లు, మిట్టపల్లి

ప్రభుత్వం ధరలు పెంచాలి



ప్రభుత్వం చర్యలు చేపట్టి బత్తాయికి గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలి. ప్రస్తుతం టన్ను రూ.15 నుంచి 20 వేలు పలుకుతుండడంతో రైతులకు పెట్టుబడులు కూడా రావు. ఈ పరిస్థితుల్లో రైతులు అప్పులపాలై తోటలను వదిలేసి పరిస్థితి దాపురించింది. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, దాసరిపల్లి

లివర్రీ!!

- ప్రాణాంతకంగా కాలేయ వ్యాధులు
- జిల్లాలో 3 లక్షల మందికిపైగా వ్యాధిగ్రస్తులు
- ఏటా 200 మందికిపైగా మృతి
- మద్యపానమే ప్రధాన కారణం
- లివర్ మార్పిడికి రూ.లక్షల్లో ఖర్చు
- నేడు ప్రపంచ కాలేయ వ్యాధుల నివారణ దినం

జిల్లాలో కాలేయ వ్యాధులు భయపెడుతున్నాయి. సుమారు మూడు లక్షల మంది ప్రస్తుతం ఈ వ్యాధులు బాధపడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో గత మూడేళ్లలో జిల్లాకు చెందిన సుమారు 200 మంది కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు చేయించుకున్నారు. వాస్తవానికి వ్యాధిగ్రస్తుల సంఖ్య మరింత ఎక్కువ ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోనే గత మూడేళ్లలో 1750 కాలేయ(లివర్) వ్యాధుల కేసులు చూసినట్లు వైద్యులు వెల్లడిస్తున్నారు. ఇక ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో ఏటా లివర్ డిసీజస్‌తో 200 మందికిపైగా మృత్యువాత పడుతున్నారంటే ఈ వ్యాధులు ఎంత ప్రాణాంతకమో తెలుస్తుంది.



నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మానవ శరీరంలోని ముఖ్యమైన అవయవాల్లో కాలేయం ఒకటి. మనం తిన్న ఆహారంలోని విషాలను హరించడం మొదలుకొని దాదాపు 500 రకాల జీవక్రియలను నిర్వర్తించే శక్తి దీనికుంది. అయితే ప్రస్తుత జీవనశైలిలో ఆహారపు అలవాట్లు మారడం, జంక్ ఫుడ్, మద్యపానం, కాలుష్యం వంటి కారణాలతో చాలా మందిలో కాలేయం దెబ్బతిని అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. ఏటా 200 మందికిపైగా కాలేయ వ్యాధులతో మరణిస్తున్నారు. వీరి సంఖ్య ఏకాదికేడాదికి పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశం.

సంక్రమించేదిలా...

ప్రధానంగా మద్యపానం వల్ల 40శాతం కాలేయ వ్యాధులు వస్తున్నట్లు పలు అధ్యయనాల్లో తేలింది. అధికంగా మద్యం సేవించడం వల్ల కాలేయం ఎక్కువ శ్రమకు గురై ఆల్కాహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్, ఆల్కహాలిక్ హెపటైటిస్, ఆల్కహాలిక్ సిర్రోసిస్ వ్యాధులు బాధిస్తున్నాయి. అధిక బరువు, మధుమేహం కారణంగానూ 30 శాతం కాలేయ వ్యాధులు ప్రబలుతున్నా యి. కొందరికి హెపటైటిస్ వైరస్, జన్యుపరంగా కూడా ఈ వ్యాధులు సంక్రమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆహార నియమాలతోపాటు తగిన జాగ్రత్తలు పాటించకపోతే కాలేయానికి ప్రమాదం తప్పదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

జాగ్రత్తలు ఇలా...

- కాలేయ వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.
- మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండాలి.
- శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి.
- శుభ్రమైన ఆహారం, నీరు తీసుకోవాలి. కొవ్వు అధికంగా ఉండే ఆహార పదార్థాల జోలికి వెళ్లకూడదు. ఆహారంలో ఉప్పు తగ్గించాలి.
- హెపటైటీస్ బీ టీకా వేసుకుంటే కాలేయ వ్యాధులు రాకుండా 90 శాతం అరికట్టవచ్చు.

కాలేయ మార్పిడి, ఆధునిక చికిత్సలు..

కాలేయ వ్యాధులకు లివర్ మార్పిడితోపాటు ఆధునిక చికిత్సలు, మందులు, టీకాలు అందుబాటులో ఉన్నాయి. కాలేయ మార్పిడి కోసం బాధితుడి కుటుంబ సభ్యులు, బ్రెయిన్ డెడ్ అయిన వారి నుంచి కాలేయాన్ని సేకరించాల్సి ఉంటుంది. దాతలు ముందుకు వస్తున్నా, ఈ చికిత్సలకు సుమారు రూ.25 లక్షల వరకు ఖర్చవుతుండటంతో సామాన్యు లు చేయించుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో కాలేయ మార్పిడి చికిత్సను ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో చేర్చాలని కోరుతున్నారు.

వ్యాధి లక్షణాలు

ఆకలి మందగించడం, వాంతులు, విరోచనాలు, కడుపునొప్పి, అలసట, నీరసం, మూత్రం పచ్చగా రావడం, చర్మం, కళ్లు పసుపు పచ్చగా మారడం, బరువు తగ్గడం, కాళ్లు... పొట్ట వాపు, రక్తపు వాంతులు, కామెర్లు, పగలు నిద్రపోతూ రాత్రుళ్ల మేల్కొని ఉండడం

నిర్లక్ష్యం వద్దు



కాలేయ వ్యాధులు ప్రాథమిక దశలో బయటపడవు. అప్రమత్తంగా ఉండి ముందుగా గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చు. ఈ వ్యాధిపై నిర్లక్ష్యం వహించరాదు. కాలేయ వ్యాధులకు సంబంధించి అప్పుడప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిది. హెపటైటిస్ బీ వ్యాక్సిన్ ఈ వ్యాధుల నివారణకు ఎంతో తోడ్పడుతుంది. కాలేయం పూర్తిగా చెడిపోతే లివర్ మార్పిడే శరణ్యం. జీజీహెచ్‌లో కాలేయ వ్యాధికి చికిత్స పొందిన వారు కోలుకున్నారు.

- డాక్టర్ సునీల్, జీజీహెచ్ హైపటైటిస్ నోడల్ అధికారి

21న విశ్రాంత ఉద్యోగుల సమావేశం

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 21న విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహిస్తున్నామని ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఐ లక్ష్మీనారాయణ, కార్యదర్శి పీ వెంకయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 4.30గంటలకు నెల్లూరు టౌన్‌హాలులో ఈ సమావేశం జరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగులకు ఇస్తున్న పెన్షన్‌ను రెండుగా విభజించి తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. దీనిపై సమావేశంలో చర్చిస్తామని పేర్కొన్నారు.

వినూత్న ఆలోచనలతో అభివృద్ధికి కృషి చేయండి

● జిల్లా ప్రత్యేక అధికారి యువరాజ్



సమావేశంలో కలెక్టర్‌తో చర్చిస్తున్న ప్రత్యేకాధికారి యువరాజ్

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : వినూత్న ఆలోచలు, టీం వర్క్‌తో జిల్లా అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ ఎన్ యువరాజ్ పిలుపునిచ్చారు. జిల్లా అభివృద్ధిపై శుక్రవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వనరులను, ప్రజావసరాల ను గుర్తించి డేటాను అనుసంధానం చేసి జిల్లాను అత్యుత్తమంగా తీర్చిది ద్దేందుకు కృషి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన ద్వారానే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. పర్యాటకంగా జిల్లాను అభివృద్ధి చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. పుణ్యక్షేత్రా లు, బీచ్‌లు, ప్రముఖ ప్రాంతాలను అనుసంధానిస్తూ టూరిజం ప్యాకేజీ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. అటవీ ప్రాంతంలో ట్రెక్కింగ్‌కు ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. జిల్లా జీడీపీ పెరిగేం దుకు వ్యవసాయ, ఉద్యాన రంగాల్లో వృద్ధి సాధించాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు చేయూతనిస్తూ, వెనుకబడిన వాటిని ప్రోత్స హించాలని ఆదేశించారు. ప్రభుత్వం పథకాలు సమర్థవంతంగా అమలు చేయడానికి అధికారుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. జిల్లాలో వివిధ రంగాల్లో ప్రగతిని కలెక్టర్ ఆనంద్ వివ రించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ, డీఆర్వో ఉదయభాస్కర్ రావు, ఆర్డీవోలు అనూ ష, వంశీకృష్ణ, పావనతి, అధికారులు పాల్గొన్నారు.

నేడు 'స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్'

● ఘనంగా నిర్వహించాలి ● మున్సిపల్ మంత్రి నారాయణ



క్యాంపు కార్యాలయంలో అధికారులు, టీడీపీ నాయకులతో సమావేశమైన మంత్రి నారాయణ, నుడా చైర్మన్ కోటంరెడ్డి

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 18, (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో శనివారం స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిం చాలని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కార్పొరేషన్ అధికారులు, టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్వచ్ఛ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని, దాని ఉద్దేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్కుల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశా రు. పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తిగా చేయాలని ఆదేశించారు. డివిజన్లలో పార్టీ నాయకులు బాధ్యతగా పని చేయాలని, పారిశు ధ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రోజుకు 8 గంటలు డివిజన్‌లో పర్యటించాలని, అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలియ చేశారు. తప్పులు చేసినందు వల్లే వైసీపీని ప్రజలు ఇంటికి పంపారన్న వాస్తవాన్ని గుర్తు పెట్టుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఏడీసీ నందన్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మేయర్ సీసీకి గాయాలు

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 18,(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు - తాటిపర్తి రహదారిపై పొట్టెపాళెం వద్ద శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో నగర మేయర్ స్రవంతి సీసీ సిద్దిక్ గాయపడ్డారు. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు... జొన్నవాడ వైపు నుంచి నెల్లూరుకు స్కూటర్‌పై వస్తున్న సిద్దక్‌ను ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో ఆయన గాయపడ్డారు. స్థానికుల సహాయంతో నెల్లూరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పూర్తి వివరాలు అందాల్సి ఉంది.

కోవూరు షుగర్ ఫ్యాక్టరీ పరిశీలన

కోవూరు, ఏప్రిల్ 18, (ఆంధ్రజ్యోతి) : కోవూరు సహకార చక్కెర కర్మాగారాన్ని కలెక్టర్ ఓ ఆనంద్ శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. కర్మాగారంలో చిన్నతరహా ఫ్యాక్టరీల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. ఈ క్రమంలో జిల్లా ప్రత్యేకాధికారి యువరాజ్, రెవెన్యూ సిబ్బందితో కలిసి కలెక్టర్ ఫ్యాక్టరీని పరిశీలించారు. ఫ్యాక్టరీ పరిస్థితులపై ఆయన ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు తెలిసింది.

ఇన్‌చార్జి కమిషనర్‌గా ఏడీసీ నందన్

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 18, (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్‌గా అదనపు కమిషనర్‌గా ఉన్న వైవో నందన్‌కు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. కమిషనర్ సూర్య తేజను ఇటీవల ప్రభుత్వం బదిలీ చేసిన విషయం విదితమే. దీంతో ఇన్‌చార్జిగా నందన్‌ను నియమిస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి ఎస్ సురేష్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

భానుడి భగభగ



సంగం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): భానుడు భగభగతో ప్రజలతోపాటు మూగజీవాలూ అల్లాడుతున్నాయి. ఎండ తీవ్రతకు పశువులు, జీవాల కాపరులు సేద తీరేందుకు చెట్ల కిందకు చేరుతున్నారు. శుక్రవారం ఎండ వేడిమి తట్టుకోలేక కావలి కాలువ ఒడ్డున ఉన్న భారీ వృక్షం నీడన గొర్రెలు సేద తీరుతుండగా ఆ దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి తన కెమెరాలో బంధించింది.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ

రాపూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని రాపూరు మండల అగ్నిమాపక అధికారి వి కుప్పయ్య తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా శుక్రవారం మండలంలోని పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీలలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అలాగే వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పెట్రోల్ పంపులు, గ్యాస్ ఏజెన్సీ సిబ్బందికి వివరిస్తూ మాక్ డ్రిల్ నిర్వహించారు. అనంతరం అగ్ని ప్రమాదాల నివారణపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఎఫ్‌లు సుధాకర్ వర్ధన్, నారాయణ, డీవోపీ షాజహన్, ఎఫ్‌ఎంలు వెంకటేశ్వర్లు, అబ్దుల్ బాసీద్ పాల్గొన్నారు.

నేతన్నలకు న్యాయం చేయాలి

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 18 (ఆం ధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో నేతన్నలకు అధిక నిధులు కేటాయించి న్యాయం చేయాలని అఖిల భారత పద్మశాలి సంఘం జిల్లా అధ్య క్షుడు బుధవరపు బాలాజీ పద్మశాలి ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జీవీకే రామకృష్ణను కోరారు. శుక్రవారం నెల్లూరులో ని సంఘం కార్యాలయానికి రామకృష్ణను ఆ హ్వానించారు. చేనేతలకు గుర్తింపు కార్డులివ్వా లన్నారు. జిల్లాలోని ఆప్కో స్థలం మీద దృష్టిపెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో పద్మశాలి ఎంప్లాయీస్ సంఘం నేతలు కేవీ శేషయ్య, పద్మశాలి సంఘం జిల్లా వర్కిం గ్ ప్రెసిడెంట్ సోమాగోపాల్ పాల్గొన్నారు.

హౌసింగ్ అవినీతిపై విచారణ జరపాలి

● గాంధీజీ విగ్రహానికి బీజేపీ వినతి



గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : పేదలందరికీ ఇల్లు కార్యక్ర మంలో జరిగిన భారీ అవినీతిపై విచారణ జరపాలని కోరుతూ బీజేపీ నాయకులు కలెక్టరేట్‌లో ఉన్న గాంధీజీ విగ్రహానికి శుక్రవారం వినతి పత్రం ఇచ్చారు. నాయకుడు మిడతల రమేష్ మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్ల నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వం నిధులు రూ.2వేల కోట్లను అధికారులు దోచుకున్నారని ఆరోపించారు. పేదల ఇళ్లకు ఇసుకను ఉచితంగా ఇచ్చారని, గృహానికి రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.15వేలు హౌసింగ్‌కు సమకూర్చిందని చెప్పారు. అయితే లబ్ధిదారులకు జేపీ వెంచర్స్ ఇసుక సరఫరా చేసినట్లుగా రూ.వెయ్యి కోట్లు మైనింగ్ శాఖకు బదలాయించి ఆ నిధులను ఉన్నత స్థాయి అధికారులు దోచుకున్నారని విమర్శించారు. రాష్ట్ర వాటాగా ఇచ్చిన ఇంటికి రూ.15వేలను డీపీఆర్‌లో చూపించ లేదన్నారు. స్టీలు కొనుగోలులో సుమారు రూ.950 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఫలాలు లబ్ధిదారులకు చేరేందుకు గాంధేయవాద ఉద్యమాన్ని ప్రారంభించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో యాకసిరి ఫణిరాజు, గిరిజ న మోర్చా ప్రసాద్, సునీల్‌రెడ్డి, రత్నం నాయుడు, గిరికుమార్ గౌడ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

అందరి భాగస్వామ్యంతో ఆదర్శ సమాజం

● ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ముత్తుకూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, ప్రభుత్వం, పరిశ్రమలు ఇలా అందరి భాగస్వామ్యంతో ఆదర్శ సమాజాన్ని తయారుచేసేందుకు కృషి చేస్తున్నామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ముత్తుకూరులో శుక్రవారం అదానీ కృష్ణపట్నం పోర్టు ప్రతినిధులతో కలిసి నిర్వహించిన ప్రైవేటు, పబ్లిక్, పీపుల్ పార్టిసిపేటెడ్ (పీ4) సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొలి అడుగుగా అదానీ కృష్ణపట్నం పోర్టు ముందుకొచ్చి ముత్తుకూరును ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు దత్తత తీసుకుందన్నారు. పునరుత్పాదక విద్యుత్, పారిశుధ్యం, విద్యా రంగాల అభివృద్ధే లక్ష్యంగా ముత్తుకూరు పంచాయతీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించారన్నారు. వీటితోపాటు మినీ స్టేడియం నిర్మాణం, ముత్తుకూరు శ్మశానం అభివృద్ధి చేపట్టాలని పోర్టు ప్రతినిధులను కోరారు. అలాగే మండలంలో ఉన్న పామాయిల్ పరిశ్రమల్లో ప్రతి కంపెనీ ఒక్కో గిరిజన కాలనీని దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలన్నారు. అంతకుముందు కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ అదానీ కృష్ణపట్నం పోర్టు యాజమాన్యానికి ప్రభుత్వం నుంచి అన్ని విధాల సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. అభివృద్ధితోపాటు కాలుష్య నియంత్రణ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కాలుష్య నియంత్రణ మండలి రాష్ట్ర చైర్మన్ కృష్ణయ్య పోర్టు యాజమాన్యాన్ని కోరారు. అనంతరం ఎమ్మెల్యే సోమిరెడ్డి యాష్‌పాండ్ బాధితులకు పరిహారం చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణపట్నం పోర్టు సీఈవో జగదీష్ పటేల్, ఆర్డీవో నాగఅనూష, తహసీల్దారు స్వప్న, ఎంపీడీవో నాగమణి, సీఓఓ రాజేష్ రంజన్, హెచ్‌ఆర్ హెడ్ అనురాగ్, కార్పొరేట్ ఎఫైర్స్ ప్రతినిధులు మృత్యుంజయరామ్, వేణుగోపాల్, టీడీపీ నాయకులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, కోదండయ్య, రామ్మోహన్‌రెడ్డి, మల్లికార్జున యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కండలేరు నీటిమట్టం 46.108 టీఎంసీలు

రాపూరు, (ఆంధ్రజ్యోతి) : కండలేరు డ్యాంలో 46.108 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ కట్టా తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల, ఇతర కాలువల నుంచి ఇన్‌ఫ్లో నీరు ఆగిపోగా, అవుట్‌ఫ్లో 1485 క్యూసెక్కులుగా ఉందని తెలిపారు.

వైభవంగా కామాక్షితాయి నిత్య కల్యాణం

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయంలో గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామి నిత్య కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. కాగా శుక్రవారం సందర్భంగా ఆలయానికి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు ముందుగా స్వామి, అమ్మవారిని దర్శించుకుని అనంతరం నిత్య కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. రాత్రి ఆలయంలో కామాక్షితాయికి నిర్వహించిన సామూహిక కుంకుమార్చన, పల్లకి సేవ నిర్వహించుకున్నారు. మహిళలు ఉదయం, సాయంత్రం ఆలయం చుట్టూ పిండి దీపారాధనలు చేశారు. ఆలయ ఈవో ఏవీ. శ్రీనివాసులు రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పాత కక్షలతో కళ్లల్లో కారం కొట్టి దాడి

పొదలకూరు, (ఆంధ్రజ్యోతి): కళ్లల్లో కారం కొట్టి వ్యక్తిపై దాడి చేసిన సంఘటన పొదలకూరు పంచాయతీ పరిధిలో లింగంపల్లి తోపు వద్ద గురువారం రాత్రి జరిగింది. పోలీసులు, బాధితుని కథనం మేరకు... లింగంపల్లి తోపులో నివాసం ఉంటున్న పిల్లిపోగు పెంచలయ్య రాత్రి భోజనం చేసిన తర్వాత తన ఇంటి బయట వాకింగ్ చేస్తుండగా పాత కక్షలు మనసులో పెట్టు కున్న చెలికా పెంచలయ్య అలియాస్ చిన్న, సంపూర్ణ దంపతులు అతని కళ్లల్లో కారం కొట్టి అల్యూమినియం బీడింగ్‌తో నెత్తిపై కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన పెంచల య్యను స్థానిక ప్రభుత్వ వైద్య శాలకు తరలించి వైద్య చికిత్స అం దించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
నెల్లూరు సిటీ
రూరల్, కోవూరు, సర్వేపల్లి
శనివారం, 19 ఏప్రిల్ 2025
7
www.andhrajyothy.com

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	109
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220

కోడిగుడ్ల ధర (100): 420

ఎస్టీల కోసం ప్రత్యేక ఆధార్ శిబిరాలు

వెంకటాచలం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆధార్ కార్డులు లేని ఎస్టీల కోసం ఈనెల 21 నుంచి 26వ తేదీ వరకు మండలంలో ప్రత్యేక ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో కల్పన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలువురు ఎస్టీలకు ఆధార్ కార్డులు లేనందున వారికి రాష్ట్ర ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలు అందడం లేదని, ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

యాదవులంతా ఏకం కావాలి

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 18, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని యాదవ ఉద్యోగులంతా ఏకం కావాల్సిన సమయం వచ్చిందని ఉద్యోగుల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం నెల్లూరులోని ఓ హోటల్లో జేఏసీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. నాయకులు కృష్ణయ్య యాదవ్, వీ గణేష్‌బాబు యాదవ్, గంగాప్రసాద్ యాదవ్ మాట్లాడారు. యాదవుల ఐక్యతకు, విద్యాభివృద్ధికి కృషి చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ డీ వెంకటేశ్వర్లు యాదవ్, శ్రీనివాసులు యాదవ్, రవీంద్ర యాదవ్ పాల్గొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి) : బాలాజీనగర్ సాయిదర్బార్ అన్నదాన సత్రంలో ఆదివారం ఉదయం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు దర్బార్ చైర్మన్ మధుసాయి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయిదర్బార్ యువజన విభాగం పర్యవేక్షణలో జరిగే ఈ శిబిరంలో యువత రక్తదానం చేయాలని కోరారు.

మంత్రి నారాయణ పరామర్శ

కోవూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : స్థానిక డొమ్మరపాలెంలో నివాసముంటున్న మంగపతి చిన్నమ్మ అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. మృతురాలు మంత్రి నారాయణ పిన్నమ్మ కుమార్తె. దీంతో మంగపతి చిన్నమ్మ కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట కూటమి నాయకులు గాదిరాజు అశోక్‌కుమార్, ఇంతా మల్లారెడ్డి తదితరులున్నారు.

● **బుచ్చిరెడ్డిపాళెం :** పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్ నుంచి జొన్నవాడ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించనున్నట్టు కమిషనర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

కోవూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక శారాబిలాక్ మెమోరియల్ తెలుగు బాప్టిస్టు చర్చిలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 40 రోజులుగా ఉపవాస దీక్షలతో ప్రత్యేక ప్రార్థనలు చేసి ముగింపు సందర్భంగా పలువురు క్రీస్తు బోధనలను విన్పించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ దావులూరి రాజేష్, చైర్మన్ కాకాణి రత్నానంద్‌రావు, వైస్ చైర్మన్ షైలా ఫ్రాన్సిస్, సెక్రటరీ తుమ్మలపెంట మోహన్, కోశాధికారి నావూరు కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమాల్ని ఎగుదల చంద్రశేఖర్, మునలి దేవపాల్ పర్యవేక్షించారు.



కోవూరు : ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు

విడవలూరు : మండలంలోని విడవలూరు, పార్లపల్లి, వావిళ్ల, చౌకిచర్ల, దంపూరు, అలగానిపాడు, దండుగుంట, వరిణి, ఊటుకూరు తదితర గ్రామంలో గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. క్రైస్తవులతోపాటు టీడీపీ నాయకులు పాశం శ్రీహరిరెడ్డి సత్యంరెడ్డి, పొన్నలూరు పురంధరెడ్డి, అడపాల జనార్దన్‌రెడ్డి, పూండ్ల ఏసోబు, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలేశుని దర్శించుకున్న వేమిరెడ్డి దంపతులు

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబరు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు శుక్రవారం తెల్లవారు జామున తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వారితో కుమారుడు, కుమార్తె దంపతులు అర్జున్‌రెడ్డి, ఐశిత, శ్రీనివాసులురెడ్డి, నీలిమారెడ్డి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.



శ్రీవారి ఆలయం ముందు వేమిరెడ్డి కుటుంబం

నేడు మెగా రక్తదాన శిబిరం

ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో శనివారం కనుపర్తిపాడు సమీపంలోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో మెగా రక్తదాన శిబిరం జరగనుంది. రెడ్‌క్రాస్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, నారాయణ హాస్పిటల్, నోవా బ్లడ్ బ్యాంక్ వంటి సంస్థలు పాల్గొని రక్తం సేకరించనున్నాయి.

వెనుకబడిన ప్రాంతాలకు నిధులివ్వండి : కోటంరెడ్డి

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 18, (ఆంధ్రజ్యోతి) : నగరంలో రూరల్ నియోజకవర్గంలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఆర్థిక చేయూతనివ్వాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణను రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డి కోరారు. వారు శుక్రవారం మంత్రితో ఆయన క్యాంపు కార్యాలయంలో భేటీ అయ్యారు. వెనుకబడిన ప్రాంతాల్లో సౌకర్యాల కల్పనకు నిధులివ్వాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ అంశాలపైనా చర్చించారు. ఈ కార్యక్రమంలో నగర ఇన్‌చార్జి కమిషనర్ నందన్ పాల్గొన్నారు.

శివారు ప్రాంతాలకు కనీస సౌకర్యాలు

నగర శివారు ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పిస్తామని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం 17వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. శివారు డివిజన్లలో తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్లు, రోడ్లు, డ్రైన్లు, కల్వర్టులు నిర్మించే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు.



మంత్రితో భేటీలో కోటంరెడ్డి సోదరులు, నందన్







రేపు నారా చంద్రబాబు నాయుడు 75వ పుట్టినరోజు

ఆయన తండ్రి నాయకుడు కాదు. ఆ కుటుంబానికీ రాజకీయ నేపథ్యం లేదు. కూడబెట్టి పేర్చిన కోట్ల సంపదా లేదు. అయినా.. అతను నాయకుడయ్యాడు. అంచెలంచెలుగా ఎదిగి ముఖ్యమంత్రి అయ్యాడు. ఏపీ అభివృద్ధికి తనే ఒక సంకేతంలా మారాడు. ఇదంతా రాత్రికి రాత్రి జరిగిన మాయ కాదు. ఒక సాధారణ రైతుబిడ్డ దేశ రాజకీయాల్లోనే కీలక భూమిక పోషించే స్థాయికి చేరుకోవడం వెనుక చాలా ఉంది. చంద్రగిరి బడి నుంచి ఎస్వీయూనివర్సిటీ పీహెచ్‌డీ పరిశోధన దాకా సాగిన ప్రయాణం ఉంది. ఈ ప్రయాణంలో అల్లరీ ఆటలూ, ఎన్నికలూ పోరాటాలూ, కులాలూ సవాళ్లూ మానవీయ స్పందనలూ ఉన్నాయి. బడిలో, కాలేజీలో, యూనివర్సిటీలో, కుటుంబంలో నారా చంద్రబాబు నాయుడుకు అత్యంత సన్నిహితంగా ఉన్నవారి మాటల్లోంచి ఏరుకున్న విశేషాలు ఇవి.. కుప్పం ఆరాధ్య నాయకుడు, నారావారిపల్లె ముద్దుబిడ్డ రేపు 75వ పుట్టినరోజు జరుపుకోబోతున్న సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేకం...

- 8వ పేజీలో

నేటి నుంచి 'ఆంధ్రజ్యోతి- ఐఆర్ఎంఎస్'

ఎడ్యుకేషన్ ఎక్స్‌పో



ఎడ్యుకేషన్ ఎక్స్‌పోలో ఏర్పాటు చేస్తున్న స్టాళ్లు

తిరుపతి(విద్య/రూరల్), ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో ఆంధ్రజ్యోతి- ఐఆర్ఎంఎస్ (ఇంటిగ్రేటెడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్) సంయుక్త ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో ఎడ్యుకేషన్ ఎక్స్‌పో జరగనుంది. ఎయిర్‌బైపాస్ రోడ్డులోని పీఎల్ఆర్ కన్వెన్షన్ హాలులో ఉదయం 10.30 నుంచి రాత్రి 7గంటల దాకా కొనసాగుతుంది. దక్షిణ భారతదేశంలోని 30 ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, కన్సల్టెన్సీ ఏజెన్సీలు ఎక్స్‌పోలో పాల్గొంటున్నాయి. ఇంటర్మీడియట్ లేదా ప్రీడిగ్రీ తర్వాత ఏ కోర్సు చేయాలనే సందిగ్ధంలో ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ ఎక్స్‌పోను సందర్శిస్తే తగిన అవగాహన కలుగుతుంది. ఆయా విద్యాసంస్థల్లో అందుబాటులో ఉన్న కోర్సులు, కోర్సుల వ్యవధి, వాటి ఫీజులు తదితర వివరాలతోపాటు విదేశీ విద్యకు సంబంధించిన సమాచారం కూడా తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఎక్స్‌పోను సందర్శించడానికి, సమాచారం పొందడానికి, అడ్మిషన్ల ప్రక్రియకు ఎలాంటి రుసుం లేదు. ఏకకాలంలో దక్షిణ భారతదేశంలోని ఇన్ని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలను ఒకే వేదికపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. జిల్లాతో పాటు నగరంలోని విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. గతంలోనూ ఈ ఎక్స్‌పోను 'ఆంధ్రజ్యోతి' విజయవంతంగా నిర్వహించింది. దీనికి జిల్లాలో అపూర్వ స్పందన కూడా లభించింది.

21 నుంచి ఎస్వీయూలో పనివేళల మార్పు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రత దృష్ట్యా ఎస్వీ యూనివర్సిటీలోని అన్ని కార్యాలయాలకు పనివేళలు మారుస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పనివేళలు ఉండేవి. దాన్ని ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకూ మార్చారు. సోమవారం నుంచి మారిన పనివేళలు అమలు కానున్నాయి. మే 31వ తేదీ వరకు ఈ కొత్త విధానం అమలు కానుంది. ఈ మేరకు రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు.

'ఈ-వేస్ట్' ఉందా?

● సేకరణకు కేంద్రాలకు తీసుకురండి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): 'మీ దగ్గర 'ఈ- వేస్ట్' ఉంటే సేకరణ కేంద్రాలకు తీసుకురండి. పర్యావరణ హితానికి ఈ-వేస్ట్ నివారణకు అందరూ భాగస్వాములు కావాలి' అని జిల్లా పంచాయతీ అధికారిణి సుశీలాదేవి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 'సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో నిత్యజీవితంలో మొబైల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, కంప్యూటర్లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు భాగమయ్యాయి. అదే విధంగా పనికిరాని ఎలక్ట్రానిక్ వస్తువులూ పెరుగుతున్నాయి. ఈ-వేస్ట్ ద్వారా మట్టి, నీరు, గాలి కలుషితమవుతుంది. అందుకని మండలకేంద్రం, 10వేలు పైబడిన జనాభా ఉన్న ప్రతి పంచాయతీలో శనివారం ఈ-వేస్ట్ సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. ఇళ్ల వద్దకు చెత్త సేకరణకు వచ్చే హరిత రాయబారులకు పనికిరాని ఎలక్ట్రానిక్ వస్తువులను అందజేయండి. లేకుంటే గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ-వేస్ట్ కేంద్రాల వద్ద కూడా అందించవచ్చు. సేకరించిన ఈ-వేస్ట్‌ను శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెస్ చేయనున్నాం' అని ఆ ప్రకటనలో డీపీవో పేర్కొన్నారు.

16వ ఆర్థిక కమిషన్‌కు సాదర వీడ్కోలు

రేణిగుంట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట విమానాశ్రయంలో శుక్రవారం 16వ ఆర్థిక కమిషన్ చైర్మన్, సభ్యులకు సాదర వీడ్కోలు లభించింది. రెండు రోజుల పర్యటన ముగించుకొని కమిషన్ చైర్మన్ అరవింద్ పనగారియా, సభ్యులు అన్నే జార్జ్ మ్యాథ్యూ, మనోజ్ పాండా, రిత్విక్ పాండే, అమృత, ఆదిత్యపంత్ తదితరులు విమానాశ్రయం చేరుకున్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ప్రిన్సిపల్ సెక్రెటరీ పియూష్ కుమార్ (ఫైనాన్స్), కలెక్టర్ వెంకటేశ్వర్, నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు. అంతకుముందుగా విమానాశ్రయం వీఐపీ లాంజ్‌లో కమిషన్ చైర్మన్ అరవింద్ పనగారియా, సభ్యులకు శ్రీకాళహస్తి కలంకారి కాన్వాస్‌ను బహూకరించారు.

పనగారియాకు కలంకారీ డిజైన్ అందజేస్తున్న మంత్రి పయ్యావుల ←



15 నిమిషాల్లోనే..

● ఆత్మహత్యకు యత్నిస్తున్న మెడికోను కాపాడిన ట్రైనీ ఐపీఎస్

తిరుపతి(నేరవిభాగం)/రామచంద్రాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సమాచారం రావడం. సెల్‌ఫోను లొకేషన్ గుర్తించి సంఘటన స్థలానికి చేరుకోవడం. ఆత్మహత్యకు యత్నిస్తున్న మెడికోను కాపాడటం. ఇదంతా 15 నిమిషాల్లోనే జరిగిపోయింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నంద్యాలకు చెందిన ఓ మెడికో తిరుపతిలోని ఎస్వీయూ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్నాడు. కొంతకాలంగా మానసిక ఒత్తిడితో బాధ పడుతున్నాడు. గురువారం తరగతులకు హాజరయ్యాడు. ఆ తర్వాత ఏం జరిగిందో కానీ.. రామచంద్రాపురం మండలం పీవీపురం సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్న మామిడి తోటలో ఆత్మహత్య చేసుకుంటానని గురువారం రాత్రి తన స్నేహితులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. వెంటనే వారు రామచంద్రాపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు. రామచంద్రాపురం సర్కిల్ వద్ద వాహనాల తనిఖీల్లో ఉన్న ట్రైనీ ఎస్పీ హేమంత్, సిబ్బంది రెండు బందాలుగా విడిపోయి మెడికో కోసం గాలించారు. ఆ సమయంలో అతడి మొబైల్ ఫోన్ నెట్ వర్కు పనిచేయలేదు. దీంతో మెడికో స్నేహితులకు ఫోన్ చేసి మెల్లగా అతడ్ని లైన్‌లోకి తీసుకున్నారు. అలా లొకేషన్ ట్రేస్ చేసి అతడిని గుర్తించారు. స్టేషన్‌కు తీసుకొచ్చి ఆత్మహత్యకు పాల్పడడానికి గల కారణాలపై ఆరా తీశారు. అప్పటికే అతడు మానసిక ఒత్తిడిలో ఉండటంతో అలిపిరి పోలీసులకు అప్పగించారు. కౌన్సెలింగ్ కోసం రుయాలో చేర్పించారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నట్లు ట్రైనీ ఎస్పీ చెప్పారు. ఏవైనా సమస్యలుంటే తోటి స్నేహితులు, తల్లి తండ్రులకు, బంధువులతో పంచుకుంటే పరిష్కార మార్గం దొరుకుతుందన్నారు. ఇలా ఆవేశంతో ఆత్మహత్యకు పాల్పడి తల్లిదండ్రులకు కడుపుకోత మిగల్చకండని విజ్ఞప్తి చేశారు. అనంతరం అతడిని తల్లిదండ్రులకు అప్పగించారు. సకాలంలో స్పందించి మెడికోను కాపాడిన ట్రైనీ ఎస్పీ, సిబ్బందిని ఎస్పీ హర్షవర్ధ రాజు అభినందించారు.



మెడికోతో ట్రైనీ ఐపీఎస్ హేమంత్

63 ప్రాంతాల్లో పోలీసుల తనికీలు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 63 ప్రాంతాల్లో గురువారం అర్ధరాత్రి పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఎస్పీ హర్షవర్ధనరాజు నేతృత్వంలో నలుగురు డీఎస్పీలు, 25 మంది సీఐలు, 40 మంది ఎస్ఐలు పాల్గొని వేరు వేరు ప్రాంతాల్లో 1329 వాహనాలను తనిఖీ చేశారు. అందులో మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై 14 కేసులు నమోదు చేశారు. బహిరంగంగా మద్యం తాగుతున్న వారిపై ఏడు కేసులు.. 102 చలానాలు వేసి రూ. 84,780 జరిమానా వసూలు చేశారు.



తిరుమలేశుడి సేవలో ప్రీతి జింటా

ప్రముఖ బాలీవుడ్ నటి ప్రీతిజింటా శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆమె మూలమూర్తిని దర్శించుకోగా, ఆలయాధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

లాసెట్ దరఖాస్తుకు 27 వరకు గడువు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ లాసెట్ దరఖాస్తుకు ఈనెల 27 చివరి తేదీగా నిర్ణయించారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, రెండేళ్ల ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశానికి ఏపీ లాసెట్, ఏపీపీజీఎల్ సెట్-2025-26 నిర్వహించనున్నారు. మార్చి 3వ తేదీ నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 27వ తేదీతో దరఖాస్తు ప్రక్రియ ముగియనున్నట్లు లాసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ టి.సీతాకుమారి తెలిపారు.



తిరుచానూరు ఆలయం వద్ద మంటలు

● అర్ధరాత్రి తప్పిన పెను ప్రమాదం

తిరుచానూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ సమీపంలో శుక్రవారం రాత్రి మంటలు చెలరేగాయి. ఆలయంలోని పోటుకు ఫ్రైడే గార్డెన్ నుంచి పైపు లైను ద్వారా నెయ్యి సరఫరా అవుతోంది. అన్న ప్రసాదాలు, లడ్డూ ట్రేలు శుభ్రం చేసిన తర్వాత మిగిలిన నెయ్యి వ్యర్థాలను ఆలయ 3వ గేటు (ఆస్థాన మండపం)వద్ద ఉన్న ఆటోస్టాండ్ సమీపంలోని డ్రైనేజీలో కలుస్తాయి. ఆ వ్యర్థాలు కలిసే చోట టీటీడీ ఎలాంటి మ్యాన్‌హోల్ ఏర్పాటు చేయలేదు. సరిగ్గా శుక్రవారం రాత్రి 11.15 గంటలకు గుర్తు తెలియని వ్యక్తులు నెయ్యి వ్యర్థాలు కలిసే చోట సిగెరెట్ వెలిగించి పడేయడంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. దీంతో పక్కనే ఉన్న దుకాణం పాక్షికంగా కాలింది. చుట్టుపక్కల ఉన్న స్థానికులు, పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. తమ వద్ద ఉన్న కార్బన్ డైఆక్సైడ్‌తో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించిన విజిలెన్స్ సిబ్బంది శివ గాయపడ్డారు. సకాలంలో ఫైర్ ఇంజన్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పేశారు. పొగ ఎక్కువగా రావడంతో ఆలయంలోకి మంటలు వ్యాపించాయేమోననే అనుమానంతో విజిలెన్స్, పోలీస్ సిబ్బంది పరుగులు తీశారు. చంద్రగిరి డీఎస్పీ ప్రసాదరావు, సీఐ సునీల్‌కుమార్, పోలీసు, విజిలెన్స్ సిబ్బంది రాత్రి 12.15 గంటల వరకు అణువణువు పరిశీలిస్తున్నారు. టీటీడీ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ సంఘటన చోటు చేసుకుందని, తిరిగి పునరావృతం కాకుండా ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



పూల బాట



తిరుపతి నగరంలో శుక్రవారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై హోరు గాలులువీచాయి. ఈ క్రమంలో చంద్రగిరి, జూపార్కు, ఎస్వీయూ, స్విమ్స్ రహదారులకు ఇరువైపులా ఉన్న చెట్ల నుంచి పూలు నేలరాలాయి. పసుపు పూలు చేత్తో చల్లినట్లు రోడ్లనిండా పరుచుకున్నాయి. ఈ దృశ్యాలు వాహనదారులు, పాదచారులకు కనువిందు చేశాయి. - తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

10 బస్తాల తమిళ రేషన్ బియ్యం పట్టివేత

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట -మునిరత్నం నగర్ జాతీయ రహదారి సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 10 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు.

గడ్డి తగలబెట్టారని కేసు నమోదు

బాలాయపల్లి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) మండలంలోని జయంపు గ్రామానికి చెందిన యనమల చిన్నయ్యకు చెందిన గడ్డి వామిని అదే గ్రామానికి చెందిన యనమల వీరరాఘవయ్య నిప్పంటించాడు. వెంకటగిరి అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను అదుపు చేశారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు బాలాయపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

21న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

తడ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అక్కంపేట వద్ద ఉన్న ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి 21వ తేదీ సోమవారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ సౌజన్య తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్ టికెట్లతో పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుందని తెలియజేశారు.

ప్రతి ఒక్కరూ శాంతిమార్గంలో పయనించాలి


మజ్జిగ, ఆహార పొట్లాలు అందజేస్తున్న తాజుద్దీన్

గూడూరు/ ఓజిలి/ కోట/ గూడూరు అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గుడ్ ఫ్రై డే సందర్భంగా శుక్రవారం పట్టణంలోని పలు చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక ఎస్ఏఎల్‌సీ చర్చిలో పాస్టర్ దైవజనుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీస్తు బోధనలను అనుసరిస్తూ శాంతి మార్గంలో నడవాలన్నారు. అదే విధంగా స్థానిక యరోషలేము చర్చి, హోసన్న మందిరం తదితర చర్చిలలో ప్రార్థనలు జరిపారు. ఓజిలి, కోట మండలంలోని చర్చిలలో ప్రార్థనలు చేశారు. గూడూరు చర్చివీధిలో అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు ఆహారం, మజ్జిగ పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు తాజుద్దీన్, రవికుమార్, నరసింహస్వామి, మహ్మద్, శ్రీనివాసులు, ఆరీఫ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విజయశ్రీకి వైసీపీ నాయకుల పరామర్శ

సూళ్లూరుపేట, ఏప్రిల్ 18 (ఆంధ్ర జ్యోతి): ఎమ్మెల్యే నెలవల విజయశ్రీని శుక్రవారం వైసీపీ నాయకులు పరామర్శిం చారు. ఇటీవల శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి నివాసంలో మెట్లు దిగుతూ కాలుజారి కిందపడడంతో కంటిపై భాగంలో ఆమెకు స్వల్పగాయమైంది. అప్పటి నుంచి సూళ్లూరుపేటలోని ఆమె నివాసంలోనే ఎమ్మెల్యే విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేను వైసీపీ నాయకులు పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ అల్లూరు అనిల్‌రెడ్డి, జెట్టి వేణుయాదవ్, అలవల సురేష్, అయితా శ్రీధర్, మీజూరు రామకృష్ణారెడ్డి, చిలకా యుగంధర్, బద్దెపూడి మోహన్‌రెడ్డి, కాకి శ్రీరామ్మూర్తి ఉన్నారు. వీరితో పాటు టీడీపీ నాయకుడు దేవారెడ్డి సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని మన్నారుపోలూరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మంగళంపాడు, టిడ్కో ఇళ్ల ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదని రూరల్ ఏఈ ఆర్.పూర్ణిమ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల సహకరించాని ఆమె కోరారు.

తడ: మండలంలోని భీములవారిపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ మురళీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్‌ను నిలిపి వేస్తున్నామని తెలియజేశారు.

వెంకటగిరి టౌన్: వెంకటగిరి పట్టణంలోని 132 కేవీ సబ్ స్టేషన్‌లో శనివారం మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు వెంకటగిరి రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదని డీ మునిచంద్ర తెలియజేశారు.

ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు

గూడూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్ స్థలాలలో ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్‌శాఖ అధికారి సురేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని నెల్లటూరు గ్రామ సమీపంలో కొందరు ఇరిగేషన్ స్థలంలో ఆక్రమణలు చేపట్టి ఫెన్సింగ్ వేస్తుండడంతో ఏఈ సంఘటనా స్థలానికి చేరుకుని ఆక్రమణలను అడ్డుకుని తొలగించారు.

చదువుల్లో ప్రోత్సహించడమే ధ్యేయం

గూడూరు, ఏప్రిల్ 18: చదువులో ప్రతిభచాటే పేద విద్యార్థులను ప్రోత్సహించడమే బలిజ మహిళా సంక్షేమ సంఘం ధ్యేయమని ఆ సంఘ గౌరవాధ్యక్షురాలు సారంగం సులక్ష్మి అన్నారు. పట్టణానికి చెందిన శృతి అనే విద్యార్థిని ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాలలో ప్రతిభచాటడంతో బలిజ మహిళా సంక్షేమ సంఘం, బలిజ విద్యాదీవెన సంస్థ సహకారంతో రూ.5 వేలు ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు. శుక్రవారం స్థానిక బలిజ మహిళా సంక్షేమ సంఘం కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సారంగం శ్రీనివాసులు, ఎంవీ.రమణయ్య, పద్మావతి, సువర్ణలక్ష్మి, అరుణ పాల్గొన్నారు.

బీజేపీ నేత సామంచికి మాతృవియోగం

నాయుడుపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు తల్లి సుబ్బలక్ష్మమ్మ శుక్రవారం మృతిచెందారు. తిరుపతిలోని స్వగృహంలో బీజేపీ ఎస్సీ మోర్చ మాజీ రాష్ట్ర కార్యదర్శి విజయభాస్కర్, జిల్లా మాజీ కార్యదర్శి చెంచుకృష్ణయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు ఆమె మృతదేహానికి నివాళులు అర్పించారు.

శ్రీనివాస సత్రంలో సర్వే బృందాలు



కోట, ఏప్రిల్ 18 : కోట మండలం సముద్రతీర ప్రాంత గ్రామాల్లో శుక్రవారం సర్వే బృందాలు భూములను సర్వే చేశారు. బాలయపల్లి తహసీల్దార్ శ్రీనివాసులు, కోట తహసీల్దార్ జయజయరావు పలు మండలాల సర్వేయర్లు ఈ సర్వే నిర్వహించారు. కొత్తపట్నం పంచాయతీలోని శ్రీనివాససత్రం, గున్నంపడియ గ్రామాల్లో భూముల వివరాలను పరిశీలిస్తూ భూములు ఎవరి ఆధీనంలో ఉన్నాయో అన్న అంశాలపై 30 ఎకరాల్లో ఈ సర్వే చేపట్టారు. చెన్నై, బెంగళూరు కోస్టల్ కారిడార్‌కు సంబంధించి ఈ భూముల సర్వే నిర్వహిస్తున్నారు.

రైల్వేస్టేషన్‌ను పరిశీలించిన అధికారులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ పథకం కింద నూతన హంగులతో విస్తరింపజేస్తున్న సూళ్లూరు పేట రైల్వేస్టేషన్‌ను శుక్రవారం రైల్వే ఏజీఎం కౌశల్ కిషోర్, డీఆర్ఎం విశ్వనాథ్ రైల్వే అధికారులతో కలిసి పరిశీలించారు. రైల్వే స్టేషన్‌ను రూ.12 కోట్లతో కొత్త ముఖద్వారం, లిఫ్టులు, విశ్రాంత భవనాలు ప్రయాణికులకు సకల సౌకర్యాలతో స్టేషన్‌లో నిర్మాణాలు చేపట్టారు. ఈ నెలాఖరులో ప్రారంభించేందుకు రైల్వే అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ క్రమంలో కొత్త హంగులతో రూపుదిద్దుకున్న రైల్వే స్టేషన్‌ను ఏజీఎం, డీఆర్ఎంలు అధికారులతో కలిసి పరిశీలించారు.

బాలసదనాన్ని సందర్శించిన డీఎస్పీ


పిల్లలతో కలిసి ఖోఖో ఆడుతున్న డీఎస్పీ గీతాకుమారి

కోట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కోటలోని బాలసదనాన్ని గూడూరు డీఎస్పీ గీతాకుమారి శుక్రవారం సందర్శించారు. అక్కడి పిల్లల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో సరదాగా కాసేపు ఖోఖో ఆడారు. వాకాడు సీఐ హుస్సేన్ బాషా, ఎస్ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులపై గౌరవం ఉండాలి


తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న చిన్నారులు

గూడూరు, ఏప్రిల్ 18: చిన్నతనం నుంచే విద్యార్థులు తల్లిదండ్రులపై గౌరవం పెంపొందించుకోవాలని స్వర్ణాంధ్రభారతి పాఠశాల కరస్పాండెంట్ నవకోటి నాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక స్వర్ణాంధ్ర భారతి పాఠశాలలో తల్లిదండ్రులకు పాదపూజ, యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిరంజన్‌రెడ్డి, సునీల్‌రాజ్, హరికృష్ణ, సింధు తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ పోరాట ఫలితమే ఎస్సీవర్గీకరణ

గూడూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ మందకృష్ణమాదిగ పోరాటాలతోనే సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ నాయకులు బిక్షాల మాదిగ అన్నారు. శుక్రవారం టవర్ క్లాక్ సెంటర్ వద్ద ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం ఆమోదం తెలియజేయడంతో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

గూడూరు అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పవరపాడు గ్రామంలో ఓ మహిళ మెడలో గొలుసును చోరీ చేశారు. రూరల్ పోలీసుల కథనం మేరకు.. తిప్పవరపాడు గ్రామంలో గ్రామానికి చెందిన లక్ష్మమ్మ కూల్‌డ్రింక్స్ దుకాణం నిర్వహించేది. శుక్రవారం దుకాణం వద్దకు గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంలో వచ్చారు. కూల్‌డ్రింక్ కావాలని అడిగారు. లక్ష్మమ్మ నుంచి కూల్ డ్రింక్ తీసుకుంటూ అకస్మాత్తుగా ఆమె మెడలోని ఆరు సవర్ల బంగారు గొలుసును లాక్కొని ఉడాయించారు. ఎస్ఐ మనోజ్‌కుమార్ కేసు నమోదు చేశారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వృద్ధుడి మృతి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. ఎండ తీవ్రతకు మృతిచెంది ఉండవచ్చునని భావిస్తున్నారు. యాచకుడిగా అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడు సవర్ల బంగారం చోరీ

నాయుడుపేట టౌన్: పట్టణంలోని మంగపతినాయుడునగర్‌కు చెందిన కస్తూరయ్య ఇంట్లో మూడు సవర్ల బంగారు నగలు గురువారం చోరీకి గురయ్యాయి. అర్బన్ సీఐ బాబి శుక్రవారం కేసు నమోదు చేశారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ఓజిలి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముందస్తు చర్యలపై శుక్రవారం ఓజిలి మండలం పెద్దపరియ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న సీఎన్‌జీ ఫిల్లింగ్ స్టేషనుకు సమీపంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయుడుపేట అగ్నిమాపక దళం ఇన్‌చార్జి డివి రమణయ్య అధ్వర్యంలో అగ్ని ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలో ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు.


కోట : చిట్టేడులోగల జీవీఆర్ రొయ్యల పరిశ్రమలో మండల అగ్నిమాపక అధికారి హరీష్ ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలు జరిగితే తక్షణం తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా వివరించారు.

24న ముస్లింల ర్యాలీ

నాయుడుపేటటౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలో ఈ నెల 24వ తేదీ వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా జరగబోవు ర్యాలీని జయప్రదం చేయాలని ముస్లింలు పిలుపునిచ్చారు. జామియా మసీదు ప్రాంగణంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అబూబకర్, హాజీ నిజాముద్దీన్, సుభహానీ, మస్తాన్, ఇబ్రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

చిట్టమూరమ్మకు పొంగళ్లు

చిట్టమూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): చిట్టమూరులో వెలసి ఉన్న గ్రామ దేవత చిట్టమూరమ్మ గ్రామ దేవత ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పెద్దలు గణపర్తి కిషోర్ నాయుడు ఆధ్వర్యంలో చిట్టమూరు, కొత్తగుంట గ్రామస్తులు అమ్మవారికి పూజలుచేసి పొంగళ్లు పెట్టారు. గూడూరు డీఎస్పీ గీతాకుమారి అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామస్తులు బాబునాయుడు, అశోక్ నాయుడు, మధునాయుడు, సర్పంచ్ కోటయ్య తదితరులు ఉన్నారు.



మా గ్యాంగ్ లీడర్

చిత్తూరు,ఆంధ్రజ్యోతి

తవణంపల్లె మండలం జి.గొల్లపల్లెకు చెందిన మధుసూదనరావు పీయూసీలో చంద్రబాబుతో కలిసి చదువుకున్నారు. చంద్రబాబుతో కలిసి యూత్ కాంగ్రెస్‌లో పనిచేశారు. పీపీగా పనిచేసి రిటైరయ్యారు. ఈయన ఒకనాటి జ్ఞాపకాలు..



మధుసూదనరావు

బీసీ స్నేహితుడ్ని లీడర్ చేశారు

ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో 1968-69లో నేను, చంద్రబాబు కలిసి చదువుకున్నాం. నేను ఇంటర్ ఫెయిల్ కావడంతో ఆయనతో పాటు కలిసి డిగ్రీకి వెళ్లలేకపోయాను. డిగ్రీలో మా అన్న పద్మనాభ నాయుడు ఆయనతో కలిసి చదువుకున్నాడు. చంద్రబాబు, మా అన్న, మదనపల్లెకు చెందిన కోటేశ్వరరావు (రిటైర్డ్ గ్రామీణ బ్యాంకు మేనేజరు).. ముగ్గురూ కలిసి ఎ బ్లాక్‌లోని రూమ్ నెంబర్ 26లో ఉండేవారు. యూనివర్శిటీలో నాన్ రెడ్డి స్టూడెంట్స్‌కు చంద్రబాబు నాయకత్వం వహించారు. అప్పట్లోనే సమానత్వం పేరుతో బీసీ స్నేహితుడిని విద్యార్థి సంఘ ఛైర్మన్ చేశారు. ఆర్థికంగా మరీ ఎక్కువ స్థాయిలో లేకున్నా మా గ్యాంగులో ఆయనే లీడర్. బయటికి ఎక్కడికెళ్లినా చుట్టూ పదిమంది ఉండేవారు. మా భుజాలపై చేతులేసి మాట్లాడేవారు.జల్లికట్టు పోటీలకు ఉత్సాహంగా వచ్చేవారు. తనూ తలపడేవారు. ఒకసారి గాయపడ్డారు కూడా.



స్నేహితులతో కర్ణాటకలోని శ్రావణ బెళగొళలో బాబు




మీసం మెలేస్తున్న చంద్రబాబు

150 బైక్‌లతో ర్యాలీ

అప్పటి చంద్రగిరి నియోజకవర్గంలోని పులిచెర్ల సమితి యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా ఆయన రాజకీయ అరంగేట్రం జరిగింది. ఇందిరా గాంధీ తిరుపతి పర్యటనలో సుమారు 150 బైక్‌లతో ర్యాలీ చేసి ఆమె దృష్టిలో పడ్డారు. రాజగోపాల నాయుడి ప్రోత్సాహంతో 1978 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు.

నాకోసం ఢిల్లీ వచ్చారు

'మీ అన్నదమ్ముల్లో ఒకరు రాజకీయాల్లోకి రండి' అంటూ చంద్రబాబు పిలిస్తే నేను వెళ్లా. యూత్ కాంగ్రెస్‌లో చంద్రబాబు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, నేను జిల్లా అధ్యక్షుడిగా పనిచేశాం. 1983 ఎన్నికల్లో నాకు చిత్తూరు ఎమ్మెల్యే టికెట్ ఇప్పించేందుకు ఢిల్లీకి కూడా వచ్చారు. పుత్తూరు నుంచి టికెట్ ఇవ్వడంతో నేను పోటీ చేయలేదు. అప్పటి టీడీపీ గాలిలో అందరూ ఓడిపోయారు. చంద్రబాబుతో పాటు నేనూ టీడీపీలో చేరా. ఇక రాజకీయాలు చేయలేను, లా చదివిన నాకు ఏదైనా ఉద్యోగం ఇప్పించమని చంద్రబాబును కోరా. అలా ఆయన వల్ల 1986 నుంచి 2011 వరకు పీపీగా పనిచేసి రిటైరయ్యా. ఇప్పుడు వ్యవసాయం చేసుకుంటున్నా.



75 ఏళ్ల బాబు

చంద్రబాబు ఎస్వీయూనివర్సిటీలో పీజీ చదివేటప్పుడు కొమ్మినేని శ్రీనివాసులు నాయుడు ఆయనకు సహచరుడు. ఒకే బెంచ్, ఒకే గదిలో ఉండేవారు. చంద్రబాబును దగ్గరగా యూనివర్శిటీలో పరిశీలించిన స్నేహితుడు. రాష్ట్ర ప్లానింగ్ బోర్డు సభ్యుడిగా చేసిన ఆచార్య కొమ్మినేని శ్రీనివాసులు నాయుడు తన దోస్తు గురించి 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్న యూనివర్శిటీ సంగతులు..

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

పదిమందిని నడిపించేవాడు

చంద్రబాబు పీజీ సహచరుడు కొమ్మినేని శ్రీనివాసులు నాయుడు



వెంట జనం ఉండాలి

1972-73లో బాబు మొదటి సంవత్సరం ఎంఏ (ఎకనామిక్స్) చదివినప్పుడు చాలా తక్కువమంది ఉత్తీర్ణులు అయ్యారు. అందులో బాబు ఒకరు. ఆయన పట్టుదల, కృషికి ఇది ఒక చిన్న తార్కాణం. ఏ పని చేయాలన్నా, ఎక్కడికి వెళ్లాలన్నా నలుగురిని కూడగట్టుకొని ముందుకుసాగేవాడు. 1973-74లో బాబు డిపార్ట్మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ స్టూడెంట్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యాడు. డిపార్ట్మెంట్లోనూ, కళాశాలలోనూ నిర్వహించే అన్ని కార్యక్రమాలనూ ప్రణాళికాబద్ధంగా అందరినీ కలుపుకుని నిర్వహించేవారు. డిపార్ట్మెంట్ ఛైర్మన్‌గా ఉంటూనే వివిధ నీటిపారుదల ప్రాజెక్టులు, పరిశ్రమల సందర్శనకు, విహార యాత్రలకు నాయకత్వం వహించి తీసుకెళ్లేవారు.

సిబ్బందికీ ఆర్థిక సాయం

యూనివర్శిటీలో హాస్టల్, మెస్ ప్రతినిధులను ఎక్కువ మందిని తన ప్యానల్లోని వారినే గెలిపించుకుని అత్యధిక మెజార్టీతో హాస్టల్, మెస్ జనరల్ సెక్రటరీగా బాబు ఎన్నికయ్యాడు. అనారోగ్యంతో బాధపడే విద్యార్థులను ఆస్పత్రులకు తీసుకెళ్లేవాడు. ఎంతోమంది నాలుగోతరగతి సిబ్బందికి ఆర్థిక సహాయం అందించేవాడు.

పేద విద్యార్థులకు ఫీజులు కట్టేవాడు

కొందరు విద్యార్థులు సకాలంలో ఫీజులు చెల్లించలేకపోతే తానే ఫీజులు చెల్లించేవాడు. ఎక్కువ మందికి ఫీజులు చెల్లించవలసి వస్తే, తన మిత్రులను ఒప్పించి వారి దగ్గర నుండి పేద విద్యార్థుల ఫీజులు కట్టిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. న్యాయం కోసం పోరాడే మనస్తత్వం చంద్రబాబుది. ఉపకారవేతనాలు సకాలంలో అందకపోతే తనే ముందుండి సోషల్ వెల్ఫేర్ ఆఫీసుకు వెళ్ళి, అక్కడి అధికారులతో చర్చలు జరిపి సకాలంలో ఉపకార వేతనం అందేటట్టు చేసేవాడు.

నడిపించే శక్తి

తాను ఎదగడమే గాక, తనలాగే సహచరులను తయారు చేయడమనేది సమర్థుడైన నాయకుని లక్ష్యం.ఆ కోవకు చెందిన నాయకుడు నారా చంద్రబాబు నాయుడు. గీతానాథ్ అనే బీసీ విద్యార్థిని విశ్వవిద్యాలయ విద్యార్థిసంఘం అధ్యక్షుడి గానూ, మోహన్ అనే కాపు నాయకుడిని కార్యదర్శిగానూ ముందుండి గెలిపించాడు. తరువాతి కాలంలో గీతానాథ్ అకడమిక్‌గా, మంచి అడ్మినిస్ట్రేటర్‌గా ఎదిగాడు. మోహన్ తిరుపతి నియోజకవర్గ ఎమ్మెల్యేగా పనిచేశాడు.

పీహెచ్‌డీ చేస్తుండగానే రాజకీయాల్లోకి

ప్రొఫెసర్ డీఎల్ నారాయణ నేతృత్వంలో పీహెచ్‌డీ చేస్తుండగానే 1976లో చంద్రబాబు రాజకీయ రంగప్రవేశం చేశాడు. పులిచెర్ల సమితికి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడయ్యాడు.

- విభిన్న సామాజిక వర్గాలకు చెందిన వారు ఆయన స్నేహితులుగా ఉండేవారు. తొండవాడ గిరిధర్ రెడ్డి, రంగంపేట సుబ్బరామిరెడ్డి, విక్టర్, పీఎస్ మునిరత్నం, షరీఫ్, కరీం వంటివారు ఆయనకు దగ్గరగా ఉండేవారు.
- చదువుకునే రోజుల్లోనే చంద్రబాబు చుట్టుపక్కల గ్రామాలలో సమస్యలను ఓర్పుగా, నేర్పుగా పరిష్కరించి పోలీసు స్టేషన్లకు, కోర్టులకు వెళ్ళకుండా రాజీ చేసేవాడు.
- 1977నవంబరు19న దివిసీమను ఉప్పెన మింగేసింది. అప్పుడు చంద్రబాబు తన మిత్రులను కూడగట్టుకుని ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పర్యటించి నగదుతో పాటు, ధాన్యాన్ని, వస్త్రాలను సేకరించి నేరుగా దివిసీమకు వెళ్ళి అందజేశాడు.
- యువత దగ్గర 'వరకట్న నిషేధిత ప్రతిజ్ఞ' పత్రాలను సేకరించి వాటిని అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జలగం వెంగళరావుకు సమర్పించి అభినందనలను పొందాడు.
- ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ద్వారా గ్రామాల్లోని ప్రజలను సంఘటితం చేసి శ్రమదానంతో రహదారులను నిర్మించి, నీటికాలువలను ఏర్పరచి చెరువులకు నీటిని మళ్ళింపజేసిన ఘనత ఆయనది.

చదువులో యావరేజ్.. ఆలోచనలు ఇంటెలిజెంట్

- చంద్రబాబు టీచర్ మునిరత్నం నాయుడు
- బాబు ఆర్థిక సంస్కరణలకు బీజం పీజీలోనే!

చంద్రబాబుకు ఎంఏలో గురువు ప్రొఫెసర్ కె.మునిరత్నం నాయుడు. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 1972-74లో చంద్రబాబు ఎంఏ ఎకనామిక్స్ చేశారు. రీసెర్చ్‌స్కాలర్‌గా ఉంటూ ఇండస్ట్రియల్ ఎకనమిక్స్‌ను ఈయన బోధించేవారు. 2014లో మునిరత్నం నాయుడు ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా కూడా చేశారు. పీజీ విద్యార్థిగా చంద్రబాబు వ్యక్తిత్వ వికాసాన్ని 'ఆంధ్రజ్యోతి'తో ఇలా పంచుకున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

పీహెచ్‌డీ గైడ్‌తో చర్చలు

చదువులో ఫస్ట్ క్లాస్ స్టూడెంట్ కాకపోయినా, అతని ఆలోచనలు చాలా ఇంటలిజెంట్‌గా ఉండేవి. పీజీ తర్వాత ప్రొఫెసర్ డీఎల్ నారాయణ మార్గదర్శకత్వంలో చంద్రబాబు పీహెచ్‌డీలో చేరారు. డీఎల్‌తో గంటలకు గంటలు చర్చలు చేసేవాడు. నేను వారిద్దరి సంభాషణ వింటుండేవాడిని. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ ఆ సమయంలో ఎస్వీయూలో పనిచేశారు. ఆయనతోనూ చంద్రబాబు సన్నిహితంగా ఉండేవారు. సీఎంగా చంద్రబాబు దార్శనికత లోకానికి తెలుసు. దానికి బీజం విద్యార్థి దశ నుంచే పడిందని నాకు అనిపిస్తుంది. నాయకత్వ లక్షణాలు, అభివృద్ధి అవకాశాల గురించిన ఆలోచనలు ఆయన అప్పట్లోనే అందరితో మాట్లాడేవాడు.



ఒబీడియంట్ స్టూడెంట్

చంద్రబాబు క్రమం తప్పకుండా క్లాసుకు హాజరయ్యేవారు. చాలా ఒబీడియంట్ స్టూడెంట్. ఎవరైనా తోకతిప్పుతున్నారని వైస్ ఛాన్సలర్ దృష్టికి వెళితే టీసీ ఇచ్చి ఇంటికి పంపించేవారు. అయితే చంద్రబాబు పక్కన నలుగురైదుగురు ఫ్రెండ్స్ ఎప్పుడూ ఉండేడారు. విద్యార్థి సంఘ నాయకుడిగా చురుగ్గా ఉండేవాడు.

ఎన్జీ రంగాపై పరిశోధన

పీజీ పూర్తవ్వగానే "వ్యవసాయ రంగం అభివృద్ధి-ఎన్జీ రంగా కృషి' అంశంపై చంద్రబాబు పరిశోధక విద్యార్థిగా మారారు. కొంత డేటా నేను కూడా ఇచ్చా. పరిశోధన పూర్తి చేశారు. కానీ సబ్మిట్ చేయలేకపోయారు. నేను హెల్ప్ చేస్తానంటే వద్దన్నారు. అప్పటికే రాజకీయాల్లో బిజీ అయిపోవడం వలన దానిని పక్కన పెట్టేశారు.

కందులవారిపల్లికి చెందిన కొత్తపల్లి దేవరాజులు నాయుడు చంద్రబాబుకు సన్నిహిత బంధువు, మిత్రుడు. శేషాపురంలో ప్రైమరీ, చంద్రగిరిలో హైస్కూలు వరకూ ఇద్దరూ కలిసే చదువుకున్నారు. తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో కలసి డిగ్రీ చదివారు. అక్కడే హాస్టల్ రూములో కలసి వున్నారు. హాస్టల్ నుంచీ బయట వచ్చేశాక కూడా తిరుపతిలో విడిగా రూము తీసుకుని ఇద్దరూ వున్నారు. చంద్రబాబు తొలి ఎన్నికల్లోనూ వెంట వుండి పనిచేశారు. అగ్నిమాపక శాఖలో ఉద్యోగం చేసి రిటైరయ్యాక ప్రస్తుతం కందులవారిపల్లిలోనే నివాసం వుంటున్నారు. చంద్రబాబుతో ఆయన జ్ఞాపకాలు.....

టెన్త్ ఫెయిల్

చంద్రగిరిలో ఇంగ్లీషు మీడియం చదవడం కష్టమై చంద్రబాబు టెన్త్‌లో ఫెయిలయ్యాడు. తిరుపతిలో టంగుటూరి ప్రకాశం పంతులు మున్సిపల్ హైస్కూల్లో తెలుగు మీడియంలో మళ్ళీ టెన్త్‌లో చేరాడు. దాంతో నాకంటే ఒక సంవత్సరం జూనియర్ అయ్యాడు. నేను తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ ఫస్టియర్ చదువుతుంటే చంద్రబాబు అక్కడే పీయూసీలో చేరాడు. మేమిద్దరం, చిత్తూరు అరగొండ సమీపంలోని పద్మనాభం నాయుడు.. ముగ్గురం ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ హాస్టల్ రూమ్ నంబరు 102లో వుండేవాళ్ళం. ఆ రూమ్‌లో మా గోల భరించలేక హాస్టల్ వార్డెన్ రాజు సార్ రూమ్ ఖాళీ చేసి వెళ్ళిపొమ్మని ఆర్డరేశాడు. దాంతో రూమ్ ఖాళీ చేసి పొర్ల వీధిలో సొంతంగా రూము అద్దెకు తీసుకుని అక్కడే చదువుకున్నాం.

తొలి ఓటమి

ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ చదివేటపుడు బీఏ హెచ్ఈపీ గ్రూపు తీసుకున్నాడు చంద్రబాబు. సెకండియర్‌లో వుండగా ఫైన్ ఆర్ట్స్ సెక్రటరీగా పోటీ చేశాడు. ప్రత్యర్థి ఫైనలియర్ స్టూడెంట్ దీనదయాళ్. అయితే పోటీ చేసినాక ప్రచారం చేయకుండా గమ్మున వుండిపోయినాడు. దాంతో ఆ ఎలక్షన్‌లో ఓడిపోయినాడు.




చంద్రబాబు తొలిఎన్నికల కౌంటింగ్ రోజు జ్ఞాపకాలు ఇవి. రాజకీయ నేపథ్యం లేదు. పేరు ప్రఖ్యాతులు లేవు. ఉరకలెత్తే ఉత్సాహం.. అండగా నిలబడే స్నేహితులు తప్ప. ఇల్లిల్లూ తిరిగి ఓట్లడిగాడు. ఉత్కంఠభరితంగా సాగిన ఓట్ల లెక్కింపులో స్వల్ప ఆధిక్యంతో అయినా.. విజయం సాధించాడు. చంద్రగిరి అసెంబ్లీ ఎన్నికల్లో అదో చరిత్ర. ఆనాటి జ్ఞాపకాలను ఇద్దరు సన్నిహితులు ఇలా పంచుకుంటున్నారు...

తొలి గెలుపు.. రెండు జ్ఞాపకాలు

ఆ రేత్రి కంటిమింద కునుకులేదు

"మా సొంత చిన్నాయన కొడుకు చంద్రబాబు నాకంటే మూడేండ్లు చిన్నోడు. నన్ను చంద్రబాబు పెద్ద మేనమామ కనుమూరి దొరస్వామి నాయుడుకు ఇచ్చి చేసినారు. అన్నలదమ్ముల బిడ్డలం కదా అందరం కలిసే పెరిగినాము. చంద్రబాబు తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసినపుడు మాది మామూలు రైతు కుటుంబం. ఆ పక్కన నిలబడింది చానా పెద్దోళ్ళు. పల్లిలో మగోళ్ళంతా చంద్రగిరికి కౌంటింగ్ కాడికి పోయినారు. ఊర్లో ఆడోళ్ళం వుండాము. రాత్రి 7.30 గంటలకు ఓట్లు లెక్క పెట్టేది అయిపోయింది. చంద్రబాబు గెలిచినాడని మాకు రాత్రి 8 గంటలకు తెలిసింది. మేము ఆ దినం బెల్లం గానుగ ఆడతా వుండాము. మూడు పెనాలు దించినాము. నాలుగో పెనం దించకుండానే వదిలేసి చెరకు తోటలో నుంచీ పల్లిలోకి పరిగెత్తుకుంటా వచ్చినాము. ఎవురి నోట్లో విన్నా మావోడు ఎమ్మెల్యేగా గెలిచిపోయినాడబ్బా.. అనే మాటే. అంత రాత్తిరిలో పూలు పెరక్కచ్చే దానికి పరిగెత్తినాము. గెలిచినాక చంద్రబాబు చంద్రగిరి నుంచీ అట్నే కొండకు పోయి దేవునికి దండం పెట్టుకోని మళ్ళా చంద్రగిరికి వచ్చినాడు. రాత్రంతా ఆడ ఊరేగింపు జరిగింది. మరుసటి రోజు తెల్లారి ఇంటికొచ్చినాడు. గెలిచినాడని తెలిసినాక పల్లిలో అందరికీ ఒకటే సంబరం. రాత్రంతా ఎవురికీ కంటి మింద కునుకు లేదు. మరసటి రోజు చంద్రబాబు జీపులో ఊర్లోకి రాగానే అందరం పూలు జల్లినాము. ఆ సంబరం, సంతోషం చెప్పలేము."

- కనుమూరి శిద్ధమ్మ
(చంద్రబాబు పెద్దనాన్న కుమార్తె), నారావారిపల్లి





గెలిచినావు అని చెప్పినా నమ్మలేదు!

"1978లో తొలిసారి చంద్రబాబు ఎమ్మెల్యేగా పోటీ చేసినాడు. చంద్రగిరిలో కౌంటింగ్ జరగతా వుంది. జనతా పార్టీ క్యాండిడేట్ కొటాల పట్టాభి చౌదరి అప్పటికే బలమైన నాయకుడు. చంద్రగిరిలో కరణం చెంచుముని పిళ్ళై ఇంటి మిద్దె మీద రూమ్‌లో కౌంటింగ్ రోజు అందరం మకాం వేసినాము. ఒకో రౌండు అయిపోతావుంది. అన్ని రౌండ్లలో కొటాల పట్టాభి చౌదరికే మెజారిటీ వస్తావుంది. లాస్టుకు రెండు రౌండ్లు మిగిలినాయి. అప్పటికి చౌదరికి ఆరు వేలకు పైన మెజారిటీ వుంది. దాంతో ఇంగ గెలిచేది లేదని చంద్రబాబు నీరసపడిపోయినాడు. అట్నే రూములో పడుకునేసినాడు. పట్టాభి చౌదరి గెలిచేసినాడని అప్పటికే రెండు సార్లు వాళ్ళ మనుషులు టపాసులు కాల్చి జిందాబాద్‌లు కొడతా వుండారు. ఇంగోపక్క లారీలో మేకపోతులు, పొట్టేళ్ళు ఏసుకుని ఇంకొందురు తలకోనకు బయల్దేరి పోయినారు డిన్నరు పెట్టుకునే దానికి. మేమంతా డీలా పడిపోయి గమ్మున కూర్చుని వుండాం. లాస్టు రెండు రౌండ్లలో పట్టాభి చౌదరిని దాటి చంద్రబాబుకు మెజారిటీ వచ్చేసింది. 1250 ఓట్ల మెజారిటీతో చంద్రబాబు గెలిచినాడని చంద్రగిరి తాసిల్దారు నారాయణ రావు అనౌన్స్‌మెంట్ ఇచ్చినాడు. పడుకోని వున్న చంద్రబాబును లేపి నువ్వు ఎమ్మెల్యేగా గెలిచినావు అంటే మొదుట నమ్మనే లేదు. యూత్ అంతా చంద్రబాబును భుజాల మీద ఎత్తుకోని రూము కాడ నుంచి తాసిల్దారు ఆఫీసు వరకూ ఊరేగింపుగా తీసకపోయినారు.

- కొత్తపల్లి దేవరాజులు నాయుడు,
కందులవారి పల్లె, చంద్రబాబు రూమ్మేట్



రాజులాయన జాతకం నిజమైంది

1968లో చంద్రబాబు ఎస్ఎస్ఎల్‌సీ. ఆ రోజు మా రిజల్టు వస్తుంది. హిందూ పేపర్లో వేస్తారు. ఆ పేపర్ కోసం 40-50 మంది పిల్లోల్లం అంతా కలిసి అర్ధరాత్రి రేణిగుంట రైల్వే స్టేషన్‌కి చేరుకున్నాం. రైల్లో పేపర్ రాగానే అందరం ఎగబడి రిజల్టు చూసుకున్నాం. అందరం పాసైనాము. చంద్రబాబు నంబరు లేదు. ఇంటికాడ నాయిన ఏమంటాడో అని భయం చుట్టుకునింది. ఒగడే రైల్వే స్టేషన్ నుంచీ నడుచుకుంటా వెళ్ళిపోతావుంటే నచ్చజెప్పినాము. మార్కుల లిస్టు వచ్చినాక చూద్దాం అందులో పాసై వుండచ్చు కదా అని ధైర్యం చెప్పి తిరుపతికి పిల్చకొచ్చినాము. మరసటి నాడు వాళ్ళ నాయన కోప్పడితే వాళ్ళమ్మ సర్దిచెప్పింది. అప్పట్లో పుత్తూరులో రాజులాయన జాతకం భలే చెప్పేవాడని పేరు. ఛార్జీలకు, ఖర్చులకు డబ్బిచ్చి వాళ్ళమ్మ మా ఇద్దరినీ పుత్తూరుకు పోయి జాతకం చూపిచ్చుకుని రమ్మని చెప్పింది. ఇద్దరం పుత్తూరుకు పోయినాం. రాజులాయన.. చంద్రబాబు చేయి కూడా చూడకుండా మొగం చూసి 'నీకు ఇంక తిరుగే లేదు... నువ్వు చాలా పైకి పోతావు పో...' అనేసినాడు. మళ్ళ వారం పది రోజులకు మార్కుల లిస్టులు వచ్చినాయి. వాటిలో చూస్తే చంద్రబాబు 52 శాతం మార్కులతో సెకండ్ క్లాసులో పాసైనాడు.